ఆదివారం
ప్రజాశక్తి
ఫిబ్రవరి 23, 2003

సైబర్ పెళ్ళిళ్ళ సందడి

హ్యాపీ బర్త్‌డే

(23-2-2003 నుండి 1-3-2003 వరకు)

స్వాతి- స్వేత (కవలలు)
1సం॥, 23.2.2002
రమ- జానయ్య
తాటికల్-నల్లగొండ

పి. కీర్తి
1సం॥,23.2.2002
దుర్గాబవాని-దుర్గారావు
తాడేపల్లి- గుంటూరు

ఆకాష్(బబ్లు)
1సం॥, 23.2.2002
అను-నర్సింహ
బాపుజీనగర్- సికింద్రాబాద్

ఆకుల రాగవేణి
3సం॥, 23.2.2000
సూర్యకళ- లక్ష్మణరావు
మార్కాపురం-విశాఖపట్నం

డి. ప్రవల్లిక
5సం॥ ఫిబ్రవరి,1998
సునీత-నర్సింహ
అంబర్‌పేట్-హైదరాబాద్

ఇ.కార్తీక్
4సం॥, 24.2.1999
లక్ష్మి-మురళీకృష్ణ
పుదిపట్ల-చిత్తూరు

డి. లిఖిత సాయి
ఫిబ్రవరి
ప్రమీల-రెడ్డి నరసింహులు
సోమల-చిత్తూరు

వి. సందీప్
3సం॥, 25.2.2000
భవాని-శ్రీనివాసరావు
పిడుగురాళ్ల-గుంటూరు

జె. హరిత
3సం॥, 25.2.2000
వీరకుమారి-రఘురామ్
పాలపర్రు- గుంటూరు

డి.మమత
1సం॥, ఫిబ్రవరి-2002
వెంకటరమణ-రవి
ముష్టికుంట్ల-ఖమ్మం

ఎమ్. కౌసల్య
2సం॥,27.2.2001
సౌజన్య-సురేంద్రనాథ్
యడ్లపాడు-గుంటూరు

బి.వినయ్
5సం॥, ఫిబ్రవరి1998
పద్మ- వసంతరావు
కన్నూరు-కరీంనగర్

శివసాయిగణేష్
మార్చి-1
నాగమణి-నారాయణ
బుధవారపేట-కర్నూలు

కూల్‌డ్రింక్స్ అనర్థదాయకం

నేటి యువతరం కూల్‌డ్రింక్స్‌తో కాలం గడుపుతున్నారు. కాని ఈ డ్రింక్స్ శరీరంలో ఎముకలను బలహీన పరుస్తాయని, ఎముకల పటుత్వం తగ్గుతుందని శాస్త్రజ్ఞులు

హెచ్చరిస్తున్నారు. కార్బన్ మిశ్రిత కూల్‌డ్రింక్స్ లోగల కెఫెయిన్ శరీరంలోని కాల్షియంను హరిస్తుందని అమెరికన్ పరిశోధకులు అంటున్నారు.

కార్బన్ మిశ్రిత డ్రింక్స్ సేవించేవారికి శరీరంలోని కాల్షియం మూత్రం ద్వారా బయటకు పోతుందని అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్ అనే పత్రికలో పరిశోధ కులు వెల్లడించారు. ఈ సమస్యతో బాధపడేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని, కాల్షియం అధికంగా గల పాలవంటి పదార్థాల బదులు కార్బన్ మిశ్రిత డ్రింకుల సేవన అధికమౌతోందని పరిశోధకులు తెల్చిచెప్పారు.

కార్బన్ మిశ్రిత తదితర కెఫెయిన్ డ్రింకులు సేవించేవారికి మూత్రం ద్వారా కాల్షియం పోవడం అధికమౌతోందని, ఫాస్ఫరిక్ లేదా సిట్రిక్ యాసిడ్ (నిమ్మ, నారింజ) గల డ్రింక్స్ తాగిన వారికి తక్కువ మోతాదులో కాల్షియం నష్టమౌతోందని వెజ్రిస్కోలోని అస్టియో పారోసిస్ రిసెర్చి సెంటర్‌లోని డాక్టర్ రాబర్ట్ హీనీ, డాక్టర్ కారెన్ రాఫర్టీ అన్నారు.

రోజుకు నాలుగు సార్లు కార్బన్ మిశ్రిత డ్రింకు తాగితే ఆ వ్యక్తి శరీరంలో ఎముకల పటుత్వ క్షీణతకు నాంది పలికినట్లేనని బ్రిటీష్ డెంటల్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ వెండీ డేన్ అన్నారు. అయితే కెఫీన్‌తో సంబంధంగల ఇతర డ్రింకుల సంగతి కూడా ఆలోచించాలని అన్నారు.

వ్యాకోచం చెందిన రక్తనాళం చుట్టూ ఒక రసాయన ద్రవం ఇంజెక్ట్ చేయబడుతుంది. భ్రంశం చెందిన (దిగజారిన), మరీ పెద్దదయిన మొలలకు ఈ చికిత్స అనువైనది కాదు.

- బయటి నుండి చేసే మరో చికిత్సను క్రయోథెరపీ అంటారు. ఇందులో మొలలకు ముద్దను కుంచింప చేయుటకు ఫ్రీజింగ్ చేయబడుతుంది. దీనివల్ల అసౌఖ్యం, వాపు, డిస్‌ఛార్జి, చీము కారటం మొదలగు అననుకూలాలు రావచ్చు.

- అతి పెద్ద మూల శంకకు రబ్బర్ బ్యాండేంజింగ్ కూడా చేయవచ్చు. కాని దీనివల్ల అల్సర్ (మానని పుండు), మొలలు ముద్ద చుట్టూ కుంచించుకుపోయి అవరోధం ఏర్పడుతుంది.

- ఆపరేషను ద్వారా మొలలును తొలగించటం కూడా ఓ పద్ధతి. కాని దీనివల్ల ఆపరేషన్ అనంతరం తీవ్రమైన నొప్పిని సహించాల్సి ఉంటుంది. 7-10 రోజులు ఆస్పత్రిలో ఉండవలసి ఉంటుంది.

- 15 నిముషాల పాటు లోతులేని వెచ్చని నీటి తొట్టెలో కూర్చుంటే నొప్పి తగ్గవచ్చు. వాపు తగ్గటానికి ఐస్ ప్యాకులను కూడా ఉపయోగిస్తారు.

- మొలలు తీవ్రంగా లేనప్పుడు, బాధ ఉన్న ప్రదేశంలో క్రీము లేక ఆయింట్‌మెంట్ రాయటం ద్వారా చికిత్సచేయవచ్చు. దీనివల్ల నొప్పికి ఉపశమనం కలిగి, వాపు, రక్త స్రావం కూడా తగ్గి, మొలలు ముద్ద సంకోచం చెందుటలో తోడ్పడి తద్వారా వ్యాధి వేగంగా నయమవుతుంది.

మొలలు రాకుండా నివారించుకోవటం ఎలా?

ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అనుసరించటం ద్వారా మూలశంకను నివారించవచ్చు.

- అధిక ఫైబరు ఉన్న ఆకు కూరలు, తాజా పళ్లు, గోధుమ, బార్లీ, ఓట్స్, బియ్యం వంటి హోల్ గ్రెయిన్ సిరియల్స్‌ని తీసుకోవాలి.

- ప్రతి రోజూ కనీసం 8-10 గ్లాసుల నీరు తాగాలి.

- నక్రమమైన మల విసర్జన అలవాట్లు పెంపొందించుకోవాలి. మల బద్ధకం లేకుండా చూసుకోవాలి.

- మంట పుట్టించి, మొలలును తీవ్రం చేసే మసాలాలు అధికంగా ఉండే ఆహారం, మద్యం, కాఫీ, టీలను నిషేధించుకోవాలి.

- మీరు స్థూలకాయులైతే క్రమం తప్పకుండా వ్యాయామం, ఆహార నియంత్రణలను చేపట్టి బరువు తగ్గటానికి ప్రయత్నించండి.

- ఎక్కువ సేపు కూర్చోవటం, నిలుచుని ఉండటం చేయకండి. ఇవి పురీష నాళ ప్రదేశంపై ఒత్తిడి తెస్తాయి.

- వదులుగా ఉండే దుస్తులనుముఖ్యంగా లోపలి దుస్తులు (అండర్ గార్మెంట్లు) కాటన్‌తో చేసినవి ధరించండి.

ఇప్పుడిక మొలలు గురించి, దానిని అదుపులోకి తేవటం గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు కనుక, మొలలు అనేది వైద్య సంబంధిత విషయం అని మీరు గుర్తుంచుకోవటం అవశ్యం. మొలలు సర్వసాధారణంగా వచ్చే సమస్యే. అయితే ఇది దైనందిన కార్యకలాపాలలో అత్యంత అననుకూలాన్ని కలిగించే సమస్య. మొలలు శస్త్ర చికిత్స ద్వారా కూడా నయం చేయవచ్చు. అయితే ఇది అంత సంతృప్తికరమైన పరిష్కార మార్గం కాదు. సమస్య మళ్ళీ రావచ్చు.

ఈ భూమిపై వెలసిన ప్రతి సంస్కృతి, లిఖిత లేక మౌఖిక పారంపర్యాల ద్వారా, వ్యాధులను నయం చేయటానికి, హీనమైన జీవన విధానాల వల్ల కలిగే లోపాలను సరిదిద్ది ఆరోగ్యాన్ని సమకూర్చేందుకు స్వస్థత చేకూర్చే మూలికల అపార సామర్థ్యాలపైనే ఆధారపడింది.

విస్తారమైన పరిశోధనలు మరియు మూలికల లోని అంశాల పరీక్షల ఫలితంగా సురక్షితమైన, ఫలకరమైన మరియు సహజసిద్ధమైన మందులు వెలువడ్డాయి. దయచేసి మరింత అధిక సమాచారం కోసం మీ వైద్యుడిని సంప్రదించండి.

వైద్యులు మూలికా ఔషధాలనే విశ్వసిస్తున్నారు. ఇవి మూలశంక వంటి బాధాకరమైన సమస్యను పరిష్కరించటమే కాక అవి పునరావృతం కాకుండా నిశ్చయ పరుస్తాయి. ◆

హాస్యధోరణి వెతలు - వెంకటరమణ 'కథలు'

అప్పారావు, రెండుజెళ్ళసీత, బుడుగు పాత్రలకు శాశ్వతత్వం కల్పించిన హాస్యబ్రహ్మ ముళ్ళపూడి వెంకటరమణ రచనలకు తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానముంది. గ్రాంథిక రచయితల తర్వాత తెలుగు సాహిత్యంలో హాస్యరసం దాదాపు కనుమరుగైపోయిన సందర్భంలో, సరికొత్త పంథాలో హాస్యరసాన్ని పెంచి పోషించిన ఘనత ఆయనది. మధ్యతరగతి కుటుంబీకుల జీవన విధానంలో నుండి ఎన్నిరకాలుగా హాస్యాన్ని ఉద్భవింప చేయవచ్చునో ఆయన రచనలు చూసి తెలుసుకోవచ్చు. తెలుగు భాషా సౌందర్యానికి కొత్త సొగసులను అద్దిన ముళ్ళపూడి వారు శబ్దాశ్రయమైన హాస్యాన్ని పండించడంలో వారికి వారేసాటి. హాస్యరసం గురించి రాసినా, కరుణ రసం గురించి రాసినా వారి శైలే వేరు. చార్లీచాప్లిన్ మాదిరిగా హాస్య, కరుణ రసాలను మిళితం చేసి 'రసన' అనే భావాన్ని కథలుగా మలచిన నేర్పు ఆయనదే. వారి శైలి అద్వితీయం, అపురూపం కూడా. అది అనువాదకులకు లొంగనిది.



ముళ్ళపూడి వెంకటరణ సాహితీ సర్వస్వం 'కథా రమణీయం-2'
సంపాదకులు : ఎమ్బీయస్ ప్రసాద్, వెల : రు. 150/-, **ప్రచురణ మరియు ప్రతులకు :** విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్;

ముళ్ళపూడి వెంకట రమణ సాహితీ సర్వస్వంగా వెలువడిన ఈ రెండవ భాగంలో వారు రాసిన కథలన్నింటిని కలిపి సమగ్ర సంకలనంగా అందజేస్తున్నారు. ఇందులో భక్తుడికి, భగవంతుడికి మధ్య వున్న అనుబంధాన్ని ఆర్ద్రంగా చిత్రీకరించిన 'కానుక' కథ మధురభక్తికి నిదర్శనం, స్టూడెంట్ కుర్రాడైన గోపాలం రాధను చూసి మనసు పారేసుకోవడం, చివరకు వాళ్ళ ప్రేమ ఫలించి పెళ్ళికి దారితీస్తుంది. అన్యోన్య దంపతులు రాధా గోపాలుల మధ్య వున్న ప్రేమలు, అలకలు, సరసాలు, విరహాలు, గిల్లీ కజ్జాలు, అభిప్రాయ భేదాలు అన్నీ తాత్కాలికమేనని, కొండకచో ఉత్తుత్తివేనని కొన్ని కథలు నిరూపిస్తాయి. వాళ్ల మధ్యకు వచ్చిన 'బుడుగు' లాంటి శంకరంతో పుత్రోత్సాహం వెల్లివిరియట, శంకరం అల్లరి చేష్టలు, చుట్టాల తాకిడికి ఇల్లు పెండ్లి విడిదిలాగా తయారవడం లాంటి సంఘటనలతో రాధాగోపాలం 'సరస రమణీయం'గా కనిపిస్తారు. వాళ్ళతో అదనంగా తండ్రిచాటు ప్రేమ వ్యవహారాలను, టైంపాస్‌కు 'ప్రేమను మల్చుకోవడానికి ప్రయత్నించి విఫలమైన సుబ్బారావులు, ఒకే అమ్మాయిని ప్రేమించి ఆ ప్రేమను సఫలం చేసుకున్న 'ఏకలవ్యుడు' లాంటి వీర ప్రేమికులు, ప్రేమను సఫలం చేసుకోవడానికి చిట్కాలు చెప్పిన గురువు గారికి, ఆ క్రమంలోనే దేహశుద్ధి చేసిన విశ్వం లాంటి ప్రేమికుల వ్యవహారాలు వారికుర్ర చేష్టలను రకరకాలుగా వర్ణించడాన్ని హాస్య, వ్యంగ్యంగా తీర్చిదిద్దడంలో మనసును గిలిగింతలు పెట్టి హాయిగా నవ్విస్తాయి. 'జరిగితే జ్వరం అంత సుఖం లేదు. దొరికితే అప్పులాంటి మంచి వస్తువు లేదు' అంటూ అప్పులు చేయడంలో అప్పారావును మించిన సుబ్బారావు 'తిమింగిలగిలం'లో చూడొచ్చు. రకరకాల ఋణ దాతలు-ఋణగ్రహీతల ఒడుపులను, శక్తి సామర్థ్యాలను వివరించే ఈ కథలు అప్పుచేయడం కూడా ఒక కళే అని నిరూపిస్తూ, సకల ప్రపంచం అప్పుమీదనే ఆధారపడి వుందనే సత్యాన్ని గుర్తు చేస్తాయి. ఇందులో సృష్టించబడిన అప్పుల అప్పారావు 'హలో మైపుండా' అనే పలకరింపుతో తెలుగు సాహిత్యంలో శాశ్వత స్థానాన్ని పెంపొందించుకోగలిగారు. శిల్పపరంగా పంచతంత్రం ధోరణిలో కథలు మళ్ళీ వాటికి ఉపకథలతో చీమల-పాముల సంవాదంగా తీర్చిదిద్దారు. హాస్య, వ్యంగ్యాలకు జోడుగా నూతన పదబంధాలను సృష్టించడం, పదాలను విరిచి కొత్త అందాలను తీసుకురావడం లాంటి సర్కస్ ఫీట్లతో వున్న ఈ కథల భాషా సౌందర్యంపై ఏకంగా సిద్ధాంత గ్రంథమే రాయొచ్చు.

రెండు రోజులుగా తిండిలేని బ్రహ్మచారి ఆనందరావు కడుపు నింపుకోవడం కోసం పడ్డ పాట్లను తెలిపే కథ ఒకటి కాగా, తర్వాత బహు కుటుంబీకుడైన ఆనందరావు ఇంటిల్లిపాది ఆకలి తీర్చడం కోసం నవ్వుల పాలైన కథ మరొకటి. ఈ ఆకలి కథలను 'జన రమణీయం'గా భావించడం అన్యాయమే. తగిన పనిని అప్పగించి 'కృతజ్ఞత'ను ఆశించే కథ ఒకటి కాగా భార్యా విధేయుల అణకువను సూచించే కథ మరొకటి. దురాలోచనలో కూడా 'లోకరీతి'ని తెలియజేసే కథ, చీమల లోకానికి వాటిల్లిన ప్రళయాన్ని మరో కథ వివరిస్తుంది. ఎన్ని కష్టాలు అవమానాలు ఎదురైనా సినీ ఫీల్డును వదిలి పోలేని విక్రమార్కుల కథ వీటన్నింటిని లోకాభిరామాయణంగా విభజించడం బాగుంది. చేతి నుండి నోటికి చేరుకునేవరకు ఎన్ని అవాంతరాలో నిరూపించే 'ప్రాప్తం', లౌక్యం-తెలివి తేటలతో ఊరివాళ్ళను బుట్టలో వేసుకున్న 'ప్రయోజకుడి కథ', డిటెక్టివ్ కథ లాంటి 'సాక్షి', ప్రయోజనాత్మక చిత్రం 'సాక్షి'గా ఎలా ఎదిగిందో ఆ కథ చదువుతుంటే ఆశ్చర్యం వేస్తుంది. చిన్న పిల్లల మనస్తత్వాలకు అనుగుణంగా ఆ కథ చదువుతుంటే ఆశ్చర్యం వేస్తుంది. చిన్నపిల్లల మనస్తత్వాలకు అనుగుణంగా వాళ్ల మనసును ఆకట్టుకునే విధంగా సులభ శైలిలో అర్థమయ్యే విధంగా రాసిన 'విమానం కథ' బాలల నవలలకు నమూనాగా నిలబడుతుంది. ఆయా కథల్లో కనిపించే పాత్రలు వాటి ప్రవర్తన వాళ్ళ సంభాషణా పరంగా చూస్తుంటే రచయితే అందులో పరకాయ ప్రవేశం చేశారా అన్న భ్రమ కలుగుతుంది. భక్తి అయినా, రక్తి అయినా, వినోదం అయినా, విషాదం అయినా అంతర్లీనంగా తొణికిసలాడే హాస్యధోరణి చప్పున ముళ్ళపూడి వారిని మనకు పట్టిస్తుంది. గతంలో వెలువడిన ఈ కథలకు అప్పట్లో వేసిన బాపు బొమ్మలను యథాతథంగా ఇందులో ఇవ్వడం చాలా బాగుంది. సంపాదకుడి కృషి ప్రశంసనీయం. వారి ముందు మాట ఈ పుస్తకానికి ప్లస్ పాయింట్‌గా మారింది.

- కె.పి.అశోక్ కుమార్

స్వీకారం



మూల్యాంకనం (గత శతాబ్ది సాహిత్యావలోకనం)
ప్రచురణ : ప్రకాశం జిల్లా రచయితల సంఘం; **వెల :** రు. 125/-, **ప్రతులకు :** బి.హనుమారెడ్డి, అధ్యక్షుడు, ప్రకాశం జిల్లా రచయితల సంఘం, రాజా పానగల్ రోడ్డు, ఒంగోలు; విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



చెఱకు తోట
రచన : చెఱకుసత్యనారాయణరెడ్డి; **వెల :**రు. 20/-, **ప్రతులకు :** చెఱకు సత్యనారాయణరెడ్డి, ఓ.ఆర్‌టి-148, ఎస్‌పిఎమ్ న్యూకాలనీ, సిర్పూర్ కాగజ్‌నగర్, విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్

...ల్కలు కలపండి

వెన్నెల - నీళ్లబావి

అది అసలే చలికాలం. దానికితోడు ఆరోజు చలి విపరీతంగా వుంది. పాదుషాగారు నలబై దుప్పట్లు కప్పుకుని పండుకున్నారు. కాని చలి ఆగలా. వెంటనే నసీరుద్దీన్‌ని పిలిపించాడు. 'ఏమయ్యా నసీరుద్దీన్! నీకు వంద బంగారు నాణాలు యిస్తాను. ఒట్టి చొక్కాతో ఆరు బయట గుడుపుతావా!' అని అడిగాడు. నసీరుద్దీన్ సరేనంటూ బయటికెళ్లాడు. చల్లటిగాలి చుట్టేసింది. దాంతో వణికిపోయాడు నసీరుద్దీన్. 'ఎలాగా' అనుకుంటూ చుట్టూ చూశాడు. ఒక తిరగలి కనిపించింది. ఇక తెల్లవార్లూ దాన్ని తిప్పుతూ కూర్చున్నాడు. చెమటలు కారసాగాయి. తెల్లవారింది. పాదుషా నిద్ర లేచాడు. నసీరుద్దీన్ చలికి చచ్చిపోయివుంటాడనుకున్నాడు. గబాల్న బయటకు వచ్చి చూశాడు. ఏముంది! నసీరుద్దీన్ చెమటలు కక్కుతూ తిరగలి తిప్పుతూ వున్నాడు. పందెంలో నెగ్గిన నసీరుద్దీన్‌కి వంద బంగారు నాణాలు యివ్వడం ఇష్టంలేదు పాదుషాకు. వెంటనే అతని దగ్గరకెళ్లి

ఏమయ్యా రాత్రి బాగా వెన్నెల కాసిందా' అనడిగాడు. దానికి నసీరుద్దీన్ అవునన్నాడు. 'అయితే యింకేం వెన్నెల కాస్తే చలిపుట్టదు. ఇంక నీకు వంద బంగారు నాణాలు ఇవ్వనవసరంలేదులే' అంటూ వెళ్లిపోయాడు. తర్వాత కొద్ది రోజులకు పాదుషా వేటకు వెళ్లాడు. అది మాంచి ఎండాకాలం. అడవిలో చుక్కనీరు దొరకకపోవడంతో నాలుక పిడచకట్టుకుపోయింది పాదుషాకు. తిరిగి వస్తూ వస్తూ నసీరుద్దీన్ వాళ్ల యింటికి వెళ్లి ' ఏమయ్యా నసీరుద్దీన్! తొందరగా మంచినీళ్లు తీసుకురా' అన్నాడు. దానికి నసీరుద్దీన్ తాపీగా పాదుషాను బావి దగ్గరకు తీసుకెళ్లి 'రండి మహాప్రభూ ఇది మీ ఇల్లే అనుకోండి. ఇదిగో ఇలా బావిలోకి చూడండి. నీళ్లు కనిపిస్తున్నాయి. దాహం తీరిందా' అన్నాడు. పాదుషాకి వళ్లు మండింది. కొరకొరా చూశాడు నసీరుద్దీన్‌ని. 'నీళ్లు చూస్తేనే దాహం తీరుతుందా' అనడిగాడు. దానికి నసీరుద్దీన్ 'అవునండీ! వెన్నెల కాస్తే చలి పుట్టనట్టే నీటిని చూస్తే దాహం తీరుతుంది' అని సమాధానం ఇచ్చాడు. అంతే పాదుషాకి తాను చేసిన తప్పు తెలిసొచ్చింది.

...కలం స్నేహం

...ం అంకిత్
...సం॥
...తరగతి
... ఆడడం, టీవీ చూడడం.
...మా : ఎ.సాయి అంకిత్, సన్నాఫ్
... -17 - 382 / పి / 102, చంపాపేట్, హైదరాబాదు.

...రాజా
...సం॥
...తరగతి
... పుస్తకాలు చదవడం, టీవీ చూడడం, షటిల్ ఆడడం.
... : గుర్రం రాజా, సన్నాఫ్ గుర్రం వెంకటేశ్వర్లు, చైతన్యపబ్లిక్‌స్కూల్,
...మ్మం.

...సేబు
...సం॥
...తరగతి
...లు చదవడం,డైరీ రాయడం, పాటలు పాడడం.
... : యు.యేసేబు, 9వ తరగతి, సన్నాఫ్ యు.గురవయ్య,
...స్కూల్, యర్రగొండపాలెం, ప్రకాశం.

పదాల పదనిసలు

?	నిన్
	సన్
	జండ్
	టర్
	పర్

ఒక్క అక్షరం కలపండి

గతవారం జవాబులు

కా	లము
	నుక
	పరి
	టుక
	వేం

తొక్క వొలుచుకునే అరటిపండు



మీరు ఎప్పుడైనా అరటిపండు తనంతట తనే తొక్క వొలుచుకోవడం చూశారా! చూడలేదా! అయితే అదెలాగో చెప్పుకుందామా? మనకు ముందు బాగా పండిన అరటిపండు కావాలి. తర్వాత ఈ అరటిపండు పట్టేంత మూతివున్న సీసాను తీసుకోవాలి. కొంచెం దూదిని (లేదా గుడ్డ పీలికలను) స్పిరిట్‌లో తడిపి సీసాలో వేయాలి. అగ్గిపుల్ల వెలిగించి సీసాలో వేయగానే అది మండుతుంది. పక్కన పెట్టుకున్న అరటిపండును కొద్దిగా వలచి సీసామూతిలో పెట్టాలి. ఇప్పుడు అరటిపండు సీసాకు బిరడాలాగా కనిపించాలి. వొలచిన తొక్క సీసాకు బయట వుంటుంది. ఇప్పుడు సీసాలో గాలి బయటకు వెళ్లదు. లోపల మంట ఆరిపోగానే అరటిపండు లోపలికి వెళ్లి తొక్క దానంతట అదే వొలుచుకుంటుంది. దీనికి కారణమేంటంటే... సీసాలో దూది మండటం వలన ఆక్సిజన్ అంతా అయిపోతుంది. దాంతో సీసాలో పీడనం తగ్గుతుంది. బయట పీడనం అధికంగా వుంటుంది. ఆ పీడనానికి అరటిపండు సీసా లోపలికి నెట్టబడుతుంది. అప్పుడు తొక్క దానంతట అదే విడిపోతుంది.

మేజిక్ మేజిక్!

పనితీరు మెరుగు - ఇండెక్సు తెప్పా

రుక్మిణి

లబలబ లాడుకుంటూ.. కిందా మీదా పడుతూ... భయంతో వెర్రిగా అరుస్తూ జక్కులోడు అధాటున రావిచెట్టు దగ్గరకు పరుగున వచ్చి అధాటున యాద్గిరిని వాటేసుకున్నాడు. యాద్గిరి కొయ్యబారి తెల్లబోయాడు. మునిమాపువేళ.. చీకట్లు కమ్ముకుంటున్నాయి. నందడి అవుడే సద్దుమణిగింది-గుళ్ళో ఎవరో గంట మోగించారు.

"ఏమయిందిరా... అరె.. ఆ వణుకుడేంది. జరవిడువ్.. అరె!" యాద్గిరి మందలింపుతో వాడు రొప్పు కాస్త తగ్గించుకుని నిమ్మళించాడు. "కుక్క.. కుక్క..లు.. వామ్మో.. పిక్క కండపూడిపోను... నయం...!" జక్కులోడు చప్టామీద స్థిమిత పడ్డాడు.

"వార్నీ.. కుక్కవెంటబడినాదిర.. నయవే.. మరి గమ్మునుండకుండా దానిజోలి కెందుకు పోయినవ్‌ర! పన్లేదుర!" మల్లేశు విసుక్కున్నాడు.

"అదికాదు గానిర మల్లేశా.. ఓటి చెప్పు.. అర్థం కాదు.. అరిచే కుక్క కరవదా.. కరిచేకుక్క అరవదా.. అహ.. నాకు తెలవకడుగుతున్నా...!" జక్కులోడు దీర్ఘం తీస్తుండగా.. యాద్గిరి బీడీ ఓటితీసి వెలిగించి గప్పున పొగ ఉంగలుగా వదిలాడు!

☆ ☆ ☆

"అసలు మన రాష్ట్రం గురించి మీకేం పట్టినట్లు లేదు. మీరు మంత్రులు.. అయినా మీ 'పనితీరు మెరుగు' పరుచుకోకుంటే ఎట్లా? ఎప్పటికపుడు మీ 'పనితీరు' సూచికలు.. ఇండెక్సుల ప్రకారమే అంచనాలు కట్టి ఫలితాల్ని బేరీజు వేయాల్సి వస్తుంది. వెరీబాడ్..!" చంద్రబాబుగారు మంత్రివర్గ సమావేశంలో మటమటలాడి పోతున్నాడు. ఇది ఎపుడూ జరిగే తంతే అయినా.. ఆ మండి పడడంలో కొత్తగా 'మెరుగు-సూచికలు' వాటి వివరం తెలవక అందరూ బుర్రలు గోక్కున్నారు. 'పని'-అదేంటో.. మెరుగు - నిర్వచనం ఇండెక్సు సూచికలు.. ప్రతిదాన్ని సంక్లిష్టం చేసి జనాల బుర్రలను ఖరాబు చేస్తేగానీ... మనం ఆడింది ఆటా.. పాడింది పాటా అని ప్రపంచబ్యాంకు గారి కన్సెల్టెన్సీలు పాఠాలు చెబుతున్నాయి గదా.. ఇదీ అంతే!

"అసలు మన రాష్ట్రం సంగతే తీసుకోండి.. రాష్ట్రంలో 82 శాతం మంది ప్రజలు తిండానికి తిండిలేక కరువు కోరలకు చిక్కి అల్లాడుతున్నారు. దేశంలో ఇంత భారీ కరువు..అబ్బా.. పిడికెడు మెతుకులు దొరకని దరిద్ర దామోదరులు మన రాష్ట్రంలోనే వున్నా మీరెవరూ పట్టించుకోవడం లేదు - దారుణం..."

మంత్రుల గుండెల్లో గూడ్సురైళ్ళూ.. సూపర్ ఫాస్ట్‌లూ ధడధడమని పరుగులు తీస్తున్నాయి - ఈ మతలబేందో కొత్తగా వుందిరా భగవంతుడా!

"63% నిరుద్యోగం... హవ్వ..! చవువుకున్న పట్టభద్రులు.. మన యువతరం రోడ్ల వెంటబడి దారీ తెన్నూ లేక తిరుగుతున్నారు. దరిద్రంలో కొట్టుమిట్లాడుతున్నారు. ఇంతదారుణమైన నిరుద్యోగం దేశంలో ఎక్కడా లేదు. ఇంత మేలి రకమైన యువశక్తి నిరుద్యోగ రక్కసి కోరల్లో పడి విలవిల్లాడిపోతున్నారు గదా..!"

ఇక లాభం లేదనుకుని మంత్రుల గుండెల్లోని గూడ్సురైళ్ళు.. ఎక్స్‌ప్రెస్ రైళ్ళు ధడా.. ధడా...ధడామని డీకొన్నాయి. ఒకరిద్దరు అప్పటికే అదుపు తప్పి మూర్ఛలోకి జారుకున్నారు.

"రాష్ట్రంలో ఇటు గ్రామాల్లో చూసినా.. పల్లెల్లో చూసినా ఏమున్నది గర్వకారణం. ఎక్కడా.. ఎక్కడా చుక్కనీరు కనిపించడం లేదు. 31 శాతం జనం మంచినీరు దొరక్క విలవిల్లాడిపోతున్నారు. మైళ్ళకొద్దీ కడవలు చంకనేసుకుని ఎండిన గొంతుకల్తో అవురావురుమని అల్లాడుతూ... మండుటెండలో... ఎండమావుల వెంట ఎగబడుతున్నారు. ఇదెంత దారుణం... హబ్బా..!"

మరో మంత్రిగారి మెదట్లో జంబో జెట్ విమానాలు విన్యాసాలకు తగులుకున్నాయి. ఈ సమస్యలన్నీ చెప్పాల్సింది ఎవరు? ఏకరువు పెట్టేది ఎవరు ? నిలదీయాల్సిన నిప్పుకణికలెవరు? "ఇదెక్కడికి దారి తీస్తుందిరి మగడా" అని ఓ మంత్రిగారు నుదురు బాదుకున్నాడు.

"అత్యంత స్వల్ప ఆదాయంతో బతుకుబండిని నెట్టుకొస్తున్నవారు 62శాతం మరి వారి జీవితాలు బాగుపడేదెట్లా? వాళ్ళ ఆదాయ వనరులు పెరిగే.. మనం పెంచే మార్గాలేమిటి? ఏంచేయాలో... ఎలాంటి చర్యలు చేపట్టి 'అభివృద్ధి సూచికల' ఆధారంగా గ్రేడులు నిర్ణయించాలో ఆలోచించారా...!"

"వామ్మో.. వామ్మో.. బాసూ.. మనల్ని అవతలి వాడెవడో నిలదీసి అడగాల్సినవన్నీ మీరే కడిగేస్తున్నారు. వామ్మో.. ఇట్లా అయితే మేం ఏమై పోవాల... మన పార్టీ ఏం కావాలి... మాకేదిరా దారి తండ్రో!" ఓ సీనియరు మంత్రి లబలబలాడాడు.

"అదేనయ్యా.. నేనిపుడు చెప్పివన్నీ మన పరిపాలన 'పనితీరు' సూచికలు.. మీరు వీటినే ఆదర్శంగా తీసుకుని పని చేయాలి.. ఫెర్‌ఫార్మెన్స్ ఇండెక్స్.. వీటన్నిట్ని ఆన్‌లైన్‌లో పెట్టి పారదర్శకంగా జనాల ముందుంచాలి. వీటన్నిటికీ బాధ్యతగా మనకు సమాధానాలు చెప్పాలని తెలియజేసుకుంటున్నాను.

"ఆగండి బాస్!" కాస్తంత అనుభవం గల సీనియరు మంత్రిగారు సీరియస్‌గానే అడ్డం తగిలాడు-" వీటన్నిటికీ సమాధానాలేగదా కావల్సింది... జనాలకే గదా చెప్పాల్సింది.. ఓసోస్.. అదెంత భాగ్యం.. వెరీసింపుల్.. జస్ట్.. మనకలవాటైన అంకెల గారడీ... ఏవుందిసార్... 82 వుందిగదా...

దాన్ని తిరగేసి 28 అనీ 63ను 36 అనీ... 31 శాతాన్ని 13 శాతం అనీ తిరగేసి నాలిక మల్లేసి చెప్తే సరిపాయె.. ఆ మాత్రం దానికి ఇండెక్సులూ.. సూచికలూ.. తకరార్లూ..."

"టట్టట్ట.. కుదర్దు.. మనది సెంట్‌పర్సంట్ పారదర్శక ప్రభుత్వం-ట్రాన్సిపరెంట్-ప్రజల వద్దకు పాలన..

ఇదెక్కడి చిక్కు వచ్చి పడిందిరా దేవుడా.. అసలు జనాల ముందు తమ మొహాలు కూడా చూపించడానికి వీల్లేకుండా ఈ ఎత్తుగానీ ఎత్తాడేమో.. ఎట్లా చచ్చేది? ఎలా బతికేది?

"వెరీసింపుల్.. మీరంతా వినండి.. వీటన్నిటికీ సమాధానం ఒకటే! 'పనితీరు మెరుగు' పరుచుకుంటున్నామని మీరంతా మొరిగితే సరిపోతుంది-మెరుగు... ఇండెక్స్.. పెర్‌ఫామెన్స్ మెరుగు.. అదే మన తారకమంత్రం.. మొరిగినంత కాలం జనం మనకేసి చెవులప్పగించి వింటూనే వుంటారు. సందట్లో మన పని మనం చేసుకుపోవాలని తెలియజేసుకుంటున్నాను...!"

☆ ☆ ☆

"ఒరే జక్కులోడా.. మళ్లా చెప్పు.. అరిచేకుక్క కరవదూ.. కరిచేకుక్క అరవదూ.. అయితే అది కురుస్తుందా.. కరవదా అనిగదా నీ సందేహం.. వారీ.. కుక్కలకు ఒళ్లు మండిమీదపడి ఏకండకాకండ చీల్చి పారేయగలవు. ఇంకో పాయింటేమిటంటే - నువు 'కుక్కలన్నీ... ముడ్డి వెనకాతలే తిరుగుతాయనుకోడం నీభ్రమ... అట్లా అనుకోవడమే నువు చేసే అతి ఘోరమైన తప్పురా నాయనా...!" జక్కులోడు ఈ వేదాంతానికి నోరెళ్ళ బెట్టాడు! ◆

ప్రత్యక్ష దేవుళ్లు!

లక్ష్మి

మొత్తం దేవుళ్లెంతమంది వున్నారో - ఆ లెక్క నాకు తెలీదు ! ఆ దేవుళ్ల జాబితాలో పతిదేవుళ్లను కూడా కలిపేసేరు . అసలు దేవుళ్ల సత్తా ఏమిటో నాకు తెలీదుగానీ - ఈ పతిదేవుళ్లు మాత్రం చాలా చాలా పవర్‌ఫుల్ దేవుళ్లు! ఈ దేవుళ్లను ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా - ఆ అతివ నిత్యనరకం అనుభవించవలసి వుంటుందన్నారు. పుట్టగతులు కూడా వుండవని శాస్త్రం చెబుతుందంటున్నారు. ఈ శాస్త్రాన్ని మగమహారాజే రాసి పెట్టేడు. చాలా పకడ్బందీగా రాసుకున్నాడు. ముందు తరాల్లో పతిదేవుళ్లకు గిరాకీ బాగా పెరిగేలా జాగ్రత్త పడి రాసుకున్నాడు. కేవలం పతిదేవుళ్లే ప్రత్యక్ష దేవుళ్లన్నాడు. ఆ మాటకింద గీత కూడా గీసి- ఆ మాటకి విలువ పెంచేడు ! అంచేత పతియే ప్రత్యక్ష దైవమన్నాడు. కంటికి కనిపించే ఈ దేవుళ్లను ప్రతినిత్యం శ్రద్ధగా కొలుచుకుంటూ తరించమని ఆడవాళ్లని హెచ్చరించేడు ! ఈ విధమైన హెచ్చరికలు - మగజాతి గౌరవం కలకాలం నిలిచేందుకు బాగా సహకరిస్తాయి ! వాళ్ల అరాచకానికి కవచంగా వుంటాయి. ఈ ఏర్పాటు కోసమే - ముందు జాగ్రత్త చర్యగా - పతియే ప్రత్యక్ష దైవమనే ముక్కని సెలవిచ్చివుంటాడని నాకో డవుటు !

భర్త అనబడే శాల్తీ ఎంత దుర్మార్గంగా ప్రవర్తించినా వారిని వారి సతీమణి అపారంగా గౌరవిస్తూ వుండాలి. అదిరూలు. ఈ రూలుని పట్టించుకోకుండా గాలి కొదిలేస్తే కళ్లుపోతాయని సంస్కృతంలో శ్లోకం రాసి - తెలుగులో అర్థతాత్పర్యాలు వివరించి - మహిళాలోకాన్ని భయపెట్టేడు ! శ్రీవారు శ్రీమతి మీద చేయి చేసుకున్నప్పుడు - ఆ సందర్భాన్ని మహాప్రసాదంగా భావించమన్నాడు. ఏడుపొస్తే మవునంగా రోదించమన్నాడు. అంతేగాని - నన్నెందుకు కొట్టేవని తొందరపడి అడిగితే - దైవాన్ని ధిక్కరించినట్టవుతుందన్నాడు. తద్వారా నరకప్రాప్తి తప్పదని స్త్రీ జాతిని అదరగొట్టేడు. అస్తమానం శ్రీవారి పాదాలు వెతుక్కుంటో - స్వామీ నాకీ చోటు చాలనే బ్రాండు డైలాగులు మాత్రమే ఉపయోగించమని ఆడవారిని హెచ్చరించేడు !

శ్రీవారు అప్పుడప్పుడు తప్పతాగి తప్పటడుగుల్లో యింటికి రావచ్చు. ఆ స్థితిలో వారు గుమ్మాలకీ, గోడలకీ గుద్దుకునే ప్రమాదముంటుంది ! అంచేత తాగివచ్చిన శ్రీవారిని గాజుబొమ్మ మాదిరి పడగ్గదికి మోసుకుతీసుకు వెళ్లడం శ్రీమతి బాధ్యత. తాగిన శ్రీవారు మౌనంగా వుండలేరు. అది సహజం. అంచేత - అకస్మాత్తుగా - నోటికొచ్చిన పద్యాలు అకారణంగా పాడతారు. అవి ఎంత ప్రాణాంతకంగా వున్నా - చిరునవ్వుతో ఎంతో ఓపికతో వినాలి. అంతేగాని - పరమ రోతగా వున్నాయని పచ్చినిజం చెబితే పతిదేవుడు పిచ్చెక్కిపోతాడు. పిచ్చెక్కిన మనిషి ఎదుటి మనిషి పీక కొరికేసే ప్రమాదముంది. అంచేత తాగిన భర్తని పిచ్చివెధవని చేసి పాపం మూటకట్టుకోకుండా - తమరు అబ్బూరి లెవెల్లో అందంగా పద్యాలు పాడుతున్నారని అర్ధాంగి తప్పని సరిగా అబద్ధమే చెప్పాలి !

అబ్బూరి మాట విన్నతర్వాత అతను కడు ఆనందిస్తాడు. అర్ధాంగిని అపారంగా గౌరవించి - నీ టేస్టుకి హేట్సాఫ్ అని అభినందిస్తాడు. ఎట్లాగో ఇంగ్లీషు ముక్క జారిపోయింది గనక తెలుగుని ఒక తన్ను తంతాడు ! ఇక అక్కడ్నించి ఇంగ్లీషు మాత్రమే అందుకుంటాడు. ఆ భాషలోనే పొయిట్రీ చదువుతాడు. ఆ పొయిట్రీ దెబ్బ తట్టుకునే శక్తి శ్రీమతికి లేకపోవచ్చు. అయినా సరె - ఓర్చుకోవాలి ! నిబ్బరంగా వుండి - అతని ఇంగ్లీషు పొయిట్రీని ఎంతో గౌరవంగా విని తీరాలి. అంత మాత్రం చేత సరిపోదు. ఎంతైనా తమరు షేక్స్పియరు కవికి వారసులని ఆమె అతన్ని ఎంకరేజ్ చేయాలి. షేక్స్పియర్ ఎక్కువగా నాటకాలు రాసేడో - కేవలం పొయిట్రీ మాత్రమే రాసేడో శ్రీవారు పట్టించుకునే స్థితిలో వుండరు. అంచేత మీరు రాబర్ట్ క్లైవ్ అన్నా సరి పెట్టుకుంటాడు ...! వదిలేయండి !

శ్రీవారిని షేక్స్పియర్తో పోల్చిన కారణంగా - శ్రీవారి ఛాతి ఉప్పొంగుతుంది. షేక్స్పియర్ ఎట్లా వుంటాడో చూడాలనే ముచ్చట కలుగుతుంది. మెల్లిగా మంచం దిగుతాడు. తప్పటడుగుల్తోనే నిలువుటద్దం కోసం ఆ గదిలోనే తచ్చాడుతుంటాడు. ఏమి వెతుకుతున్నారని శ్రీమతి అడక్కూడదు. అద్దం కోసం శ్రమపడుతున్నారని అర్థం చేసుకోవాలి. వారిని అద్దం ముందు నిలబెట్టేందుకు సహకరించాలి. వారు అద్దంమ్ముందు నిలబడ్డానని అతి కష్టమ్మీద తెలుసుకోగలుగుతారు. మత్తుమీదున్న మనిషి తన బొమ్మని అద్దంలో చూసుకోడం వీలవదు. అంచేత షేక్ స్పియర్ వెక్కడ అని శ్రీమతిని అడిగే ప్రయత్నంలో కిటికీని అడుగుతాడు ! ఈ రాద్ధాంతం భార్యామణి భరించక తప్పదు. ఈ సందర్భాల్లోనే పతియే ప్రత్యక్ష దైవమనే మాటకి అర్థతాత్పర్యాలు దొరుకుతాయి ! అప్పుడే భార్యామణి తరిస్తుంది ! అప్పుడే ఆమె పుణ్యలోకాలకు వెళ్లే అర్హత కూడా సంపాయించుకుంటుంది ! అంతేగాని - తగునా ఇది నాథా అని భర్తని నిగ్గదీసి అడక్కూడదు. శోకాలు పెట్టకూడదు. అట్లా చేస్తే పుణ్యలోకాలు దూరమై పోతాయని ఆడవారిని భయపెట్టింది మగమహర్షులే !

◆

సెలయేళ్ళ సరిగమలు
ఏడుపాయలు

సొరంగంలో వెలసిన కనకదుర్గమ్మ

జి.శ్రీశైలం

మామూలు సమయాలలో కొండలు, కోనలు తప్ప కరుచూపుమేరలో జన సంచారం ఉండని అటవీ ప్రాంతమది. పెద్దపెద్ద బండరాళ్ళు, గలగలపారే సెలయేళ్ళు, పిచ్చుకల అరుపులు, నక్కల ఊళలు, కోతులు, కొండెంగల సయ్యాటలతో ఏడాది పొడవునా ఒంటరి వారిని భయకంపితులను చేసే నిర్జన ప్రదేశమది. అప్పుడప్పుడు తమ మొక్కుబడులను తీర్చుకోవడానికి వచ్చే యాత్రికులతో కొంతసేపు కళకళలాడి తిరిగి యథా ప్రకారం నిర్జనంగా ఉండే ఈ అటవీ ప్రాంతం మహాశివరాత్రి వచ్చిందంటే పదిరోజులపాటు లక్షలాది భక్తులతో, ఆధునిక వసతులతో మహానగరాలనే మరిపిస్తూ దేదీప్యమానంగా వెలుగుతుంది. అదే మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రతి సంవత్సరం జరిగే జాతరలలో అన్నిటికంటే పెద్దదిగా ప్రఖ్యాతిగాంచిన 'ఏడుపాయల జాతర.' మెదక్ పట్టణానికి ఇరవై కిలోమీటర్ల దూరంలో పాపన్నపేట పరిధిలోని నాగ్సానిపల్లి గ్రామ శివారులోంచి పరవళ్ళు తొక్కుతూ గలగల పారే మంజుల మంజీరా నదీమతల్లి ఎదలో 'శివరాత్రి' మొదలుకొని వారం రోజులపాటు ఈ జాతర జరుగుతుంది.

ఏడు పాయలుగా చీలిపోయిన మంజీరా నది మధ్య భాగంలోని ఒక గుట్ట సొరంగంలో వెలిసిన 'కనకదుర్గమ్మ' వారిని ఈ సందర్భంగా భక్తులు పూజిస్తారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్నాటకల నుండే కాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి దాదాపు పది లక్షల మంది యాత్రికులు హాజరయ్యే ఈ జాతరకు ఎన్నో ప్రత్యేకతలు, మరెన్నో చారిత్రక గాథలు ఉన్నాయి. కర్నాటకలోని పర్వత శ్రేణుల్లో పుట్టి బీదర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల గుండా ప్రవహిస్తూ గోదావరి నదికి ఉపనది అయిన మంజీరా నది ఇక్కడ ఏడు పాయలుగా చీలి రెండు మూడు కిలోమీటర్లు ప్రవహించి తిరిగి అవి ఒకటిగా కలిసిపోయి నిజాంసాగర్ వైపు సాగిపోతుంది. ఈ నది ఏడు భాగాలుగా చీలి ఒకటిగా కలిసే ప్రదేశాల మధ్య భాగంలో గుట్టల మధ్య బండరాళ్ళమయమైన ఒక సొరంగంలో వెలసిన అమ్మవారికి ఈ జాతర జరుపుతారు. జమదగ్ని, అత్రి, కాశ్యప, విశ్వామిత్ర, వశిష్ఠ, భరద్వాజ, గౌతమ అనే సప్త ఋషుల పేర్లతో ఏడుపాయలను పిలుస్తారు. వీటితోపాటు పాపాల మడుగు, ఏకోత్తర శతకుండలం, మునిపట్టు తపోభూమి, సంతర్పణ స్థలాలుగా పేరొందిన ప్రాంతాలలో భక్తులు పూజలు చేస్తారు. పాపాల మడుగులో స్నానం చేస్తే పాప విముక్తులవుతారనేది భక్తుల విశ్వాసం.

గరుడ గంగగా పేరొందిన మంజీరానది ఏడు పాయలుగా చీలిపోవడం గురించి, అది ఉద్భవించడం గురించి ఎన్నో పురాణ, చారిత్రక కథలు ఇక్కడి జానపదులు చెబుతారు. ద్వాపర యుగాంతంలో పాండవ వంశపు కడపటి రాజు, పాండవుల మునిమనుమడైన జనమేజయుడు తన తండ్రిగారైన పరీక్షిత్ మహారాజు మరణానికి కారణమైన సర్పజాతిని సమూలంగా అంతమొందించాలని సప్త ఋషులతో సర్పయాగం చేయించినట్టుగా పురాణాలు చెబుతున్నాయి. కాగా సర్పయాగం జరిగిన స్థలం ఇదేనని ప్రజల నమ్మకం. ఏడుగురు మహర్షుల ఆధ్వర్యంలో జరిగిన యాగాగ్ని గుండాలలో సమస్త సర్ప సంతతి ఆహుతి కావడం జరిగిందని, ఈ యాగంలో ఆహుతైన సర్ప రాజులకు సద్గతి లభించేందుకు 'గరుడుడు' పాతాళ లోకంలోని 'భోగవతి' నదీమ తల్లిని తీసుకువచ్చాడని, ఆ నది సప్త మహర్షుల యజ్ఞగుండాలను తాకేందుకు ఏడుపాయలుగా చీలి ప్రవహించినట్టుగా ఒక గాథ ప్రచారంలో ఉంది. గరుడుడు తీసుకురావడం వల్లే భోగవతికి గరుడగంగ అనే పేరు వచ్చిందనే నమ్మకం కూడా ఉంది.

ఈ గాథకు భిన్నంగా మరో కథ కూడా ఉంది. జనమేజయుడు సర్పయాగం జరపడంతో సర్పసంతతి సమూలంగా నాశనమైన అనంతరం యజ్ఞ ప్రభావంతో శివుడి మెడలోని సర్పం సైతం శివుడిని కూడా లాక్కుని ఆహుతి కావడానికి తరలి రావడంతో సర్పంతోపాటు శివుడు కూడా ఆహుతి కావడం తథ్యమని భావించిన దేవతలు అంతకన్నా ముందుగానే యాగాన్ని నిలిపివేయాలని ప్రయత్నించి దానిని చల్లార్చడానికి గంగాభవానిని, గరుత్మంతుని పంపారట. ఆకాశంలో సంచరిస్తూ గరుత్మంతుడు దారి చూపుతుండగా నేలపై గంగ ప్రవహిస్తూ వస్తున్న విషయాన్ని తెలుసుకొన్న ఋషులు యాగస్థలానికి కొద్ది దూరంలోనే నిలిపివేయడానికి చేసిన ప్రయత్నంలో గంగ ఏడు పాయలుగా చీలిపోయి ప్రవహించి తిరిగి ఒకటిగా కలిసిపోయి యాగాన్ని చల్లార్చిందని మరో కథ ప్రచారంలో ఉంది. అందుకే మంజీరా నదిని గరుడగంగగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ గంగాభవాని, శివుడు, ముత్యాలమ్మను సైతం భక్తులు కొలవడం విశేషం.

శివరాత్రి రోజు జాగరణలు చేసి దుర్గాభవానిని పూజించడంతో ఈ జాతర ప్రారంభమవుతుంది. ఇందులో అత్యంత రమణీయంగా, కన్నుల పండువగా ఉండే ఘట్టం 'బండ్లు తిప్పడం' అనే ప్రధాన కార్యక్రమం. శివరాత్రి మరుసటిరోజు ఈ కార్యక్రమం జరుగుతుంది.

కేవలం భక్తులేగాక ప్రకృతి ఆరాధకులు కూడా చూడదగ్గ ప్రదేశం ఈ ఏడుపాయలు. ఇక్కడి ప్రకృతి ఒడిలో ఎంతో మానసిక ఆనందం లభిస్తుంది. పట్టణాలలోని యాంత్రిక జీవనం నుండి, రోజువారీ ఉరుకులు పరుగుల నుంచి ఉపశయనం పొందగోరే వారు తప్పక దర్శించదగిన సుందర ప్రదేశమిది. కాలుష్య రహిత జలాలతో, చల్లని గాలులతో అలరారే ఈ ప్రదేశాన్ని ఒక్కసారైనా దర్శించి తీరాల్సిందే. ◆

ఎం.కె.రాంప్రసాద్

వివాదాలమయం వరల్డ్‌కప్

వరల్డ్‌కప్ జరుగుతున్న తీరు ఐసిసి ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ మాల్కం స్పీడ్ కంటికి కునుకును దూరం చేస్తుండవచ్చు. టోర్నమెంట్‌లో ఇప్పటికే అనేక వివాదాలు చోటుచేసుకున్నాయి. ఒకదాని వెంట మరో వివాదం. అసలు ఈ టోర్నమెంటే వివాదాలతో ప్రారంభమైంది. కాంట్రాక్ట్‌కు సంబంధించిన వివాదాలు, జింబాబ్వే, కెన్యాల్లో ఆడేందుకు అభ్యంతరాలు, నల్ల తొడుగులు ధరించి మ్యాచ్‌ల్లో పాల్గొనడం, డోపింగ్ కేసులు, జాతి వివాదాన్ని రెచ్చగొట్టే ప్రకటనలు, ఇలా ఒకటేమిటి.. . ఎన్నో వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. తమ క్రీడాకారులతో సమస్యలను ఎదుర్కోవడంతో పాటు క్రికెట్ బోర్డులు ఐసిసితో కష్టాలు ఎదుర్కొంటున్నాయి. మామూలుగా సమయం గడుస్తున్న కొద్దీ సమస్యలు పరిష్కరించబడతాయి. ఆశ్చర్యం కలిగించే విధంగా వరల్డ్‌కప్‌లో రోజు గడుస్తున్నప్పటికీ సమస్యలు మరింత జటిలమవుతున్నాయి. తమ బోర్డులకు షరతులు విధించగలిగిన స్థాయికి క్రీడాకారులు చేరుకున్నారు. క్రీడాకారుల సంఘాలు మరింత చురుకుగా వ్యవహరిస్తున్నాయి. వాటి ఆధిపత్యం పెరిగిపోతోంది. ఐసిసి ఒకరకంగా ఇరకాటంలో పడింది. ఐసిసి ఒంటెద్దు పోకడలు కూడా సమస్యలకు కారణం. అంతా తాను అనుకున్నట్లు జరుగుతుందనే ధీమాలో ఉంటే దానికి ఎదురుదెబ్బలు తప్పవు. కప్ ఇప్పటివరకూ జరిగిన తీరు ఐసిసికి పాఠం నేర్పి ఉండాలి. అది ఇక ముందు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తుందనడంలో సందేహం లేదు. కాంట్రాక్టుల విషయంలో భవిష్యత్తులో జరిగే టోర్నమెంట్స్‌లో అది మరింత స్పష్టమైన వైఖరి తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే మ్యాచ్‌ల వేదికలు నిర్ణయించే విషయంలో కూడా ఏకపక్షంగా వ్యవహరించడం దానికి ఇకముందు సాధ్యపడకపోవచ్చు. ఐసిసి ఇప్పటికే అనేక విషయాల్లో ఇబ్బందులను ఎదుర్కొంది. ముఖ్యంగా జింబాబ్వే, కెన్యాల్లో మ్యాచ్‌లు నిర్వహించడం దానికి తలనొప్పిగా పరిణమించింది. భద్రతా కారణాలతో జింబాబ్వేలో ఆడేందుకు ఇంగ్లండ్ నిరాకరించింది. క్రీడాకారులకు పూర్తి భద్రత చేకూరుస్తామని ఐసిసి ఇచ్చిన హామీలను ఇంగ్లండ్ పట్టించుకోలేదు. చర్చోపచర్చల అనంతరం ఇంగ్లండ్, జింబాబ్వే మ్యాచ్‌ను రద్దు చేసి పూర్తి పాయింట్లను జింబాబ్వేకు కేటాయించాలని అది నిర్ణయించింది. జింబాబ్వేలో ఆడేందుకు ఇంగ్లండ్ జట్టు అంతగా ఎందుకు భయపడిందీ ఎవరికీ అర్థం కాలేదు. వారు ఆడాల్సింది ఒక్కమ్యాచే. ఆడేందుకు నిరాకరించడం ద్వారా సూపర్ సిక్స్ దశకు చేరుకోలేకపోయే ప్రమాదాన్ని అది తనకుతానే సృష్టించుకుంది. ఈ వివాదం వల్ల జింబాబ్వే జట్టు లబ్ధి పొందింది. ఆ జట్టు ఇప్పటికే ఎనిమిది పాయింట్లు సంపాదించింది. ఆ జట్టు ఇంకా హాలెండ్‌పై ఆడాల్సి ఉంది. ఆ మ్యాచ్‌లో జింబాబ్వే సునాయాసంగా గెలుస్తుందని భావించవచ్చు. అంటే సూపర్ సిక్స్ దశకు చేరుకోవాలంటే భారత్, పాకిస్తాన్ మిగిలిన మ్యాచ్‌ల్లో కనీసం మూడింటిలో గెలుపొందాలి. జింబాబ్వేతో ఆడే విషయమై ఆసీస్ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. మ్యాచ్‌ను బహిష్కరించాలని ఆ జట్టు నిర్ణయిస్తే జింబాబ్వేకు మరో నాలుగు పాయింట్లు అప్పనంగా లభిస్తాయి. గ్రూప్-ఎలో బలహీనమైన జట్టు పన్నెండు పాయింట్లతో అగ్రస్థానంలో నిలబడుతుంది. పెద్దగా కష్టపడకుండానే ఆ జట్టు సూపర్ సిక్స్ దశకు చేరుకుంటుంది. కెన్యాలో మ్యాచ్ ఆడేదీ, లేనిదీ తేల్చుకోలేక న్యూజిలాండ్ సతమతమవుతోంది. వరల్డ్‌కప్ జరగాల్సిన రీతిలో జరగడంలేదని ఐసిసి ఇప్పటికే అర్థం చేసుకుని ఉండవచ్చు. ఇది ఇలా ఉండగా మరో వివాదం తలెత్తింది. జింబాబ్వే జట్టులోని ఇద్దరు ప్రధాన ఆటగాళ్లు- ఆండీ ఫ్లవర్, హెన్రీ ఒలాంగో కొత్త వివాదం సృష్టించారు. తమ దేశంలో ప్రజాస్వామ్యం అంతమైందని విమర్శిస్తూ వారు నల్లని బ్యాండ్లు ధరించి మ్యాచ్‌ల్లో ఆడుతున్నారు. ఈ విషయంలో నిర్ణయం తీసుకునే అధికారాన్ని జింబాబ్వే బోర్డు ఐసిసికి అప్పగించింది. తమ అధ్యక్షుడిని విమర్శిస్తూ తెంపుతో ప్రకటనలు చేశారు. ఇటువంటి తరహా ప్రకటనలపై చర్య తీసుకోగల అధికారం ఆ దేశ ప్రభుత్వానికే ఉంటుంది. దీనిని కూడా ఐసిసికి విడిచిపెట్టడం దానికి ఇబ్బంది కలిగించే మరో అంశం అనడంలో సందేహం లేదు. వార్నే కూడా వివాదాలకు అతీతంగా లేడు. అతడు డోపింగ్ టెస్టులో పట్టుపడినట్టు ఆసీస్ క్రికెట్ బోర్డు స్వయంగా వెల్లడించింది. అతణ్ణి స్వదేశానికి ఆఘమేఘాలమీద పంపింది. తన తల్లి ఇచ్చిన టాబ్లెట్‌ను మాత్రమే తీసుకున్నానని, తాను అమాయకుడనని వార్నే ప్రకటించాడు. నిబంధనలు ఎంత జటిలంగా ఉన్నాయో తెలుసుకున్న వారెవరూ కావాలని ఉత్ప్రేరక మందులు తీసుకోరు. పసిపిల్లలు మాత్రమే తల్లిపై పూర్తిగా ఆధాపడతారు. ఇటువంటి పొరపాట్లను వారు మాత్రమే చేసే అవకాశం ఉంది.


బౌన్సర్లు వేసినందుకు గాను పాకిస్తాన్ బౌలర్ వకార్ యూనస్‌ను మందలిస్తున్న అంపైర్

వరల్డ్‌కప్ వంటటి పెద్ద టోర్నీల సమయంలో అజాగ్రత్తగా వ్యవహరించడం వార్నేకే చెల్లింది. ఈ వార్తను ఎవరో కావాలనే లీక్ చేసి ఉండవచ్చు. ఈ స్థితిలో వార్నేపై చర్య తీసుకోక ఆసీస్ క్రికెట్ బోర్డుకు తప్పలేదు. పాకిస్తాన్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన మ్యాచ్‌లో మరో వివాదం చోటుచేసుకుంది. పాక్ వికెట్ కీపర్ రషీద్ లతీఫ్ ఆసీస్ వికెట్‌కీపర్ ఆడం గిల్‌క్రిస్ట్‌ను జాతిపేర దూషించినట్లు వార్తలు వచ్చాయి. మ్యాచ్ రిఫరీ క్లైవ్ లాయిడ్ విచారణ జరిపి సాక్ష్యాధారాలు లేకపోవడంతో లతీఫ్‌ను నిర్దోషిగా తీర్పుచెప్పారు. ఆసీస్‌తో జరిగిన మ్యాచ్‌లో వకార్ యూనస్ వరుసగా రెండు బౌన్సర్లను వేయడం కూడా వివాదం సృష్టించింది. అంపైర్ అతణ్ణి తీవ్రంగా మందలించాడు. మరోవైపు దక్షిణాఫ్రికా ఆటగాళ్ళు రకరకాల ప్రకటనలతో తమ కెప్టెన్‌ను ఇబ్బంది పెడుతున్నారు. ఇది దక్షిణాఫ్రికా బోర్డుకు శిరోభారంగా పరిణమించింది. గొడవలు మాని ఆటపై దృష్టిని నిలపాలని ఆటగాళ్ళను హెచ్చరించవలసిన పరిస్థితి దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డుకు వచ్చింది. ఇన్ని వివాదాలు చోటు చేసుకున్నప్పటికీ నిరాశ చెందాల్సిన అవసరం లేదు. ఇకముందైనా అంతా సవ్యంగా జరుగుతుందని ఆశిద్దాం. తాజాగా భారత్ బ్యాట్స్‌మెన్, ముఖ్యంగా సెహవాగ్, గంగూలీ వాడుతున్న బ్యాట్‌లు నిర్దేశిత పరిణామం మించి ఉన్నాయనే వివాదం తలెత్తింది. దీనిపై మ్యాచ్ రిఫరీ క్లైవ్ లాయిడ్ విచారణ జరుపుతున్నారు. ◆

బింగి సత్యనారాయణ



అమ్మ దొరికింది

సమయం రాత్రి 7 గంటలు. టాంక్ బండ్‌పై శ్రీశ్రీ విగ్రహం పక్కనున్న లాన్‌లో ట్రాజిక్ హీరోలా మౌనంగా కూర్చున్నాను. ప్రతిరోజూ ఆఫీస్ నుండి నేరుగా ఇంటికివెళ్ళే నేను ఈ సమయంలో ఇక్కడికి రావటానికి కారణం, మనసులో తీవ్ర ఆందోళన, చెప్పలేనంత దిగులే. పరిసరాలు విద్యుత్ దీపాల వెలుగులో ఎంత బావున్నా, తిలకించాలన్న భావన, ఆసక్తి ఎమాత్రం లేవు. నా ఆలోచనల దిశ మారక బుర్రవేడెక్కిపోతోంది. మెదడు దారీతెన్నూ తెలియని అడవిలా తోస్తోంది. నా ఈ పరిస్థితికి కారణం, సమస్య... అలాంటిది! తలలో భూమ్యాకాశాలు బద్దలై పోతున్నట్టుగా ఉంది. ఓ ప్రైవేట్ ఆఫీసులో అకౌంటెంట్‌గా పనిజేస్తున్న నేనంటే, మా జనరల్ మేనేజర్‌గారికి చెప్పలేనంత అభిమానం. ఎంతో సిన్సియర్‌గా పని చేసే నేను ఏ ఒక్క రోజూ ఆఫీసుకు లేట్ రాలేదని, కలుపుగోలుగా ఉండే నికార్సయిన మనిషినని కాబోలు, సోదర భావంతో చూస్తాడు. కర్మ కాకపోతే నిన్న సాయంత్రం ఆయనగారి బైక్ ఎక్కవలసి వచ్చింది. డ్యూటీ ముగించుకొని ఇంటికి బయలుదేరుతున్న నన్ను వారించి, తన కూడా బైక్ మీద ఎక్కించుకొని, మా వీధిలోనున్న జ్యుయలర్ షాప్ ముందు ఆపాడు. ఆయనతో పాటు నేనూ లోనికి వెళ్లాను. రిసిప్ట్ జేబులోంచి తీస్తుండగానే "సార్.. రెడీ అవుతోంది. రేపు మార్నింగ్ వచ్చి తీసుకెళ్ళవచ్చు!" అన్నాడు షాపు ఓనరు పరిచయపూర్వకంగా. ఇద్దరం షాప్ బయటికొచ్చాము.

"ధనుంజయ్ ఒక పని చేస్తావా!" అన్నాడు బయటకు రాగానే సాలోచనగా నా వైపు చూస్తూ.

"చెప్పండి సార్!" అన్నాను వినయంగా.

"రేపు మార్నింగ్ ఆఫీస్ కొచ్చే ముందు ఈ రింగ్ తీసుకురాగలవా! మళ్ళీ నేనిటు రావడం అదొక పని..."

"అలాగే సర్!" అన్నాను. ఆయన నాపై చూపించే అభిమానానికి ఏ మాత్రం ఆలోచించకుండా. 'మనీ మొత్తం పే చేశాను. ఈ రిసిప్ట్ చూపిస్తే చాలు రింగ్ ఇచ్చేస్తారు' అని రిసిప్ట్ నాచేతికిచ్చి వెళ్ళిపోయాడు. అదే నా పాలిటి శాపమైంది.

ఈ రోజు ఇలా... దిక్కుతోచక రేపు ఏమి చేయాలో ఎటూ తేల్చుకోలేక పిచ్చెక్కిపోతోంది. ఎదుటి వారి సమస్యలకు సునాయాసంగా ఉపాయం చెప్పే నేను, నా సమస్యను ఛేదించలేకపోతున్నాను. సమస్య అలాంటిది మరి. "ప్చ్.. తలరాత ఇలా తగలడింది" అనుకున్నాను మనస్సులో నిట్టూరుస్తూ. నిన్నటి ఉదయపు జీవితానికి నేటి ఉదయపు జీవితానికి ఎంత తేడా! ఉదయం జరిగిన సంగతి తలచుకుంటే...

* * *

ఉదయం 9 గంటలకు రోజూలాగే లంచ్‌బాక్స్‌తో ఆఫీసుకు బయలుదేరి, మధ్యలో జిఎంగారు గత సాయంత్రం అప్పజెప్పిన పని పూర్తి చేసుకొని బస్టాప్‌లో నిల్చున్నాను. "బాబూ.. ధర్మం చేయండి నాయనా! మీ బిడ్డలు సల్లగుంటరు." అభ్యర్థనగా అన్నమాటలు వెనక నుండి వినబడ్డాయి. ప్రతిరోజూ వినే మాటలే అవి. కాస్త వంగిన నడుము, తెల్లబడిన వెంట్రుకలు, వయసుపైబడినట్టుగా చెప్పే మోమునిండా ముడతలతో ఎముకలగూడులా ఉండే ఆవిడే. శరీరాన్ని మెల్లిమెల్లిగా మైనంలా కరిగిస్తున్న కుష్టురోగంతో చూడగానే అసహ్యం కలిగించేలా ఉండే వికార రూపం. అందుకేనేమో అక్కడ నిల్చున్న వారిలో విసుక్కునే వారు, కసురుకునే వారు ఎక్కువ. కాని నాకు మాత్రం దీనంగా అర్థించే ఆమె జాలి చూపులు చూస్తే గుండెను పిండేసి ఆవిడపై సానుభూతి కలిగేది. కుష్టుకు ఇప్పుడు మందులున్నాయి. కాని ఎవరు పూనుకుంటారు. ఆమెకు ఎవరు నయం చేయిస్తారు. ఇంతలో కనిపించేంత దూరంలో నా ఆఫీస్ రూట్ వైపు వెళ్లే బస్ ఎడమ వైపు ఒరిగి వస్తుంది. వస్తున్న బస్ వెనక డోర్‌వైపు చూశాను. కాళ్ళు రోడ్డుకు తగిలేంతగా ఫుట్‌బోర్డ్‌పై తూనీగల్లా వేలాడుతున్నారు ప్రయాణీకులు. బస్ నిండా ప్రయాణీకులను చూసి ఎక్కడమా! మానడమా! అనే ద్వైదీభావనలో పడ్డాను. ఈ బస్‌ను వదిలేస్తే మరో అరగంట దాకా బస్ లేదు. బస్ వచ్చి నాముందు నిల్చుంది. ఏ ఒక్కరూ వెనక నుండి దిగిన వారు లేరు. "బాబూ! ధర్మం చేయి నాయనా!" అంది ఆవిడ ప్రాధేయ పూర్వకంగా. ఆదుర్దాగా చొక్కా జేబులోంచి చేతికందిన చిల్లర వేసి కదుల్తున్న బస్‌లోకి కష్టపడి ఎక్కగలిగాను. వేలాడుతూ దిగాల్సిన స్టేజి రావటంతో దిగి చెదిరిన టక్‌ను సరిచేసుకొని ప్యాంట్ జేబులోకి చెయ్యిపోనిచ్చాను. ఒక్కసారిగా గుండె ఆగినంత పనయింది. చలనం లేని మనిషిలా నోటమాట రాలేదు. మామూలు కన్నా స్పీడెక్కువై గుండె కొట్టుకోనారంభించింది. కళ్ళు బైర్లు కమ్మాయి. తలగిర్రున తిరుగుతున్నట్టుగా తోచింది. 'డైమండ్ రింగ్' ఉన్న బాక్స్ ప్యాంట్ జేబులో లేదు. వెంటనే కనిపించేంత దూరం వెళ్ళిన బస్‌ని అందుకునేందుకు ఆటోలో ఫాలో అయ్యాను. డ్రైవర్‌కి సైగ చేసి బస్ ఆపించి ముందు డోరు నుండి ఎక్కి కంగారుగా మొహానికి పట్టిన చేతులతో తుడుచుకుంటూ కండక్టర్, డ్రైవర్‌కు రింగ్ విషయం ఏకరువు పెట్టాను. నేను చెప్పినదంతా ప్రయాణీకులు ఆసక్తితో, మౌనంగా విన్నారు.

"ప్లీజ్.. ఎవరికైనా దొరికితే ఇవ్వండి!" అన్నాను అభ్యర్థనగా చేతులు జోడించి ప్రయాణీకుల వైపు చూస్తూ కొందరు దొరకలేదన్నారు. మరి కొందరు సోదా చేసుకోమన్నట్టుగా లేచి నిలబడ్డారు. ఒక వ్యక్తి లేచి బస్‌లో ఉన్న వారందరినీ సోదా చేశాడు. ఫలితం మాత్రం శూన్యం. "మీరు ఎక్కగానే కొట్టేసి నెక్స్ట్ స్టేజీలో దిగిపోవచ్చు వాడు. ఇంకా ఇందులోనే ఉంటాడా! అయినా అంత విలువైనది

పెట్టుకొని బస్‌లో రావటం ఏమిటి? ఓ పది పారేసి ఆటోలో వెళ్ళొచ్చుగదా! ఎందుకీ బాధ.. టెన్షన్" అన్నది ఓ ప్రయాణీకుని కంఠం. నా కళ్ళలో సన్నటి నీటి తెర కమ్ముకుంది. అదే ఆటోలో ఆఫీస్ ముందు దిగి పరధ్యానంలో వెళుతున్న నన్ను ఆటో అతను పిలిచి డబ్బులడిగితే ఇచ్చి పంపించేశాను. అడుగులు బరువుగా పడుతున్నాయి. మెల్లగా నడుస్తూ జి.ఎం.గారి ఛాంబర్‌లోకి వెళ్ళి ముభావంగా ఆయన ముందు నిల్చున్నాను. ఏదో ఫైలు చూసి పక్కన పెడుతూ నన్ను చూసి కూర్చోమని సీటు చూపించాడు. శరీరం సన్నగా కంపించసాగింది.

"నీకోసమే చాలాసేపట్నుంచి ఎదురు చూస్తున్నాను. ఏదీ ఆ డైమండ్‌రింగ్"

"......"

"ఇంటికెళ్ళి మా ఆవిడకు ఇచ్చొచ్చావా ఏంటి? ఆ రింగ్ చూసి చాలా మురిసిపోయుండొచ్చు. మూడు నెలల నుండి నా ప్రాణాలు తోడేస్తుందయ్యా. దాని కసలే జాతకాల పిచ్చి. ఎవరో పండితుడు నీ జన్మ నక్షత్రం ప్రకారం వజ్రపుటుంగరం ధరించాలన్నాడట. ఇహ అప్పట్నుంచి మొదలు నాతో పోరు. తనకు ఏ చిన్న చెడు సంఘటన జరిగినా, ఆ రింగ్ పెట్టుకుంటే ఇలా జరిగి ఉండేది కాదేమోనని తెగ బాధపడటం. ఆ బాధ చూళ్ళేక ముప్పయివేలు ఖర్చు పెట్టి చేయించాను" అన్నాడు కాసింత గర్వం కలబోసిన స్వరంతో.

రింగ్ పోయిన విషయం ఎలా చెప్పాలి? నేను చెప్పేది విని ఎలా రియాక్ట్ అవుతాడోనని, ఒళ్ళంతా వణుకు, చెమటలు, గుండెలో దడ...

"సా...ర్... మీ...తో..." అన్నాను నోట్లోంచి మాట పెగలక హీనస్వరంతో.

"ఏంటయ్యా చెప్పు!" అన్నాడు ఆనందంగా పేపర్ వెయిట్ గుండ్రంగా తిప్పుతూ.

"సార్.. మీ ఉంగరం.." అన్నాను. పూర్తిగా చెప్పే ధైర్యం లేక గొంతు జీరతో.

అరచేతులకు, ముఖానికి పట్టిన చెమటలను కర్చీఫ్‌తో తుడుచుకుంటూ నిల్చున్నాను. ఏమీ అర్థం కాని వాడిలా నా వైపు వింతగా చూశాడు.

"మీ ఉంగరం పోయిందిసార్..." అన్నాను. ముక్తసరిగా తడారిన గొంతు పెగుల్చుకుని భయం భయంగా. జి.ఎం.వెంటనే నిశ్చేష్టుడై, తేరుకుని టేబుల్‌పైనున్న వాటర్ గ్లాసందుకొని ఒక్క గుక్కలో నీళ్ళు తాగేసి, "ఏంటీ! ఉంగరం పోయిందా?" అన్నాడు వెర్రి చూపులు చూస్తూ.

"అవున్సార్! బస్‌లో ఎవరో కొట్టేశారు.." అన్నాను ఆయన ముఖంలోకి సూటిగా చూడలేక తలదించుకొని. నేను వేసుకున్న షర్ట్ చెమటలతో సగం తడిసిపోయింది.

"ఏంటయ్యా! పోయిందని అంత తాపీగా చెబుతున్నావు. అదేమన్నా రెండుమూడు రూపాయలకు జాతరలో దొరికే ఉంగరం అనుకుంటున్నావా! ముప్పై వేల ఉంగరం" అన్నాడు కోపంగా. ఆయన కళ్ళు ఎర్రరంగు పులుముకొన్నాయి. ఇదివరలో ఆయన్ను అంతకోపంలో ఎప్పుడూ చూడలేదు.

"రింగ్ పోయిందంటున్నావు. నిజంగానే పోయిందంటున్నావా!.. లేక.." అన్నాడు అనుమానం చూపుతో. ఆ మాటల్లో నాపై అనుమానం ప్రస్ఫుటంగా అగుపడుతుంది. రింగ్ పోగొట్టినందుకు చెంపచెళ్ళుమని వాయించినా బాధ పడేవాణ్ణి కాదు. కానీ ఇంతకాలం నాపై ఆయనకున్న అభిమానం, గౌరవం, నమ్మకం ఈ రింగ్ విషయంలో గంగలో కలిసినందుకు బాధగా ఉంది.

"సార్. రింగ్ నిజంగానే పోయింది. నా పిల్లల మీద ఒట్టేసి చెబుతున్నాను" అన్నాను తలమీద అరచేతిని పెట్టుకొని.

"సర్సరే! పిల్లల మీద ప్రమాణాలెందుకుగాని, ఈ రింగు పోయిన విషయం మా ఆవిడకుగాని తెలిసిందంటే పెద్ద రాద్ధాంతం చేస్తుందయ్యా. ఇంట్లో దానితో ఎలా వేగేది? మళ్ళీ అంతడబ్బు ఎక్కడ నుండి తెచ్చేది? నా దగ్గర సరిపోక, అప్పు చేసి మరీ చేయించాను. ఎల్లుండి దాని పుట్టిన రోజు. ఆ బర్త్‌డే రోజున ఆ రింగ్ లేకపోతే.. తలచుకుంటే ఏదో రకంగా ఉంది" అన్నాడు బాధగా.

కాసేపు మా ఇద్దరి మధ్య మౌనం చోటు

చేసుకుంది.

"మరి ఇప్పుడెలా చేస్తావు?" అన్నాడు నా సమాధానం కోసం.

ఏమి చెప్పాలో తోచలేదు.

"పోలీస్ కంప్లయింట్ ఇద్దాం సార్" అన్నాను నసుగుతూ. నా మాట వినగానే ఆయనకు చిర్రెత్తుకొచ్చి,

"అదేమన్నా కోహినూర్ వజ్రమనుకుంటున్నావా? అమ్మేటప్పుడు, కొనేటప్పుడు దొరకడానికి, అది దొరుకుతుందో లేదో తెలియదు. అప్పటిదాకా నా పరిస్థితి" అన్నాడు విసుగ్గా. నా అలక్ష్యం వల్లే ఇలా జరిగిందని లోలోన నన్ను నేనే ఎంతగానో తిట్టుకున్నాను.

"సీ మిస్టర్ ధనుంజయ్! నువ్వు ఏమి చేస్తావో, ఎలా చేస్తావో నాకు తెలియదు. మా ఆవిడ బర్త్‌డే సమయానికి రింగ్ నా చేతిలో ఉండాలి. అంతే!" అన్నాడు దృఢంగా ముఖం చిట్లిస్తూ. ఇంతలో ఫోన్ మోగింది. రిసీవర్ అందుకున్న కొన్ని క్షణాల్లోనే ఆయన మొహం రంగులు మారి, చిరు చెమటలు పట్టాయి. కర్చీఫ్‌తో తుడుచుకుంటూ,

"నేను చెప్పేది వినుకాంతం! షాపుకి వెళతావా! వద్దొద్దు. ఆ రింగు రెడీకాలేదట. రేపు మధ్యాహ్నం కల్లా రెడీ అవుతుందట. ఇందాకే ఫోన్‌చేసి కనుక్కున్నాను. ఆఁఆఁ రేపు ఈవినింగ్ మనింట్లో ఉంటుంది. సరేనా! ఇక ఉంటాను. ఫోన్ పెట్టేసి "హమ్మయ్య" అని ఊపిరి పీల్చుకొని నా వైపు చూస్తూ, చూశావా! నీ వల్ల మా ఆవిడతో చీవాట్లు. షాపుకి వెళదామని రెడీ అయ్యి నన్ను రమ్మని ఫోన్ చేసింది. ఇంకా నయం సరాసరి అక్కడికే వెళితే.. అమ్మో! అందుకే రెడీ కాలేదని అబద్ధం చెప్పవలసొచ్చింది. అదే పోయిందని చెబితే ఏ అఘాయిత్యం చేసుకునేదో, చూడు ధనుంజయ్! నువ్వు ఏమి చేస్తావో నాకనవసరం. రేపు మాత్రం నాకది తెచ్చివ్వాలి" అన్నాడు చివరి మాటలు వత్తి పలుకుతూ.

ఆయన ఛాంబర్ నుండి నా సీట్లోకొచ్చి కూర్చున్నాను. ఏమి చేయాలో పాలుపోవడం లేదు. తలపైన తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్‌లా నా బుర్ర గిర్రున తిరుగుతోంది. అంతడబ్బు ఎలా తెచ్చేది?

ఆలోచనల నుండి తేరుకుని వాచ్ చూసుకున్నాను. 8 గంటలయింది. పక్కనున్న టిఫిన్ బాక్స్ తీసుకొని ఇంటికి బయలుదేరాను. గుమ్మంలోకి అడుగు పెట్టగానే, టీవీ చూస్తున్న పిల్లలు, "మమ్మీ! డాడీ వచ్చేశారు!" అని బిరబిరా వచ్చి కాళ్ళను పెనవేశారు భరత్, భూషణ్. పెనవేసిన కాళ్ళను విడిచి చెరోచెయ్యి పట్టుకుని నాతోపాటే లోనికి నడిచారు. సోఫాలో కూర్చుని నీరసంగా నిట్టూర్చి వెనక్కి వాలి కళ్ళుమూసుకున్నాను.

"సాయంత్రం నాకు షూ తెస్తానని అన్నావుకదా డాడీ! తేలేదేం?" అన్నాడు భరత్ అమాయకంగా.

ఈ రోజుసాయంత్రం, అందరం సర్కస్‌కెళదామన్నావు కదా డాడీ! ఇంత ఆలస్యం చేశావేం? మేము ఫైవోక్లాక్ రెడీ అయ్యి నీ కోసం ఎదురుచూస్తున్నాము" అన్నాడు ఐదేళ్ళ భూషణ్. వాళ్ళడిగిన ప్రశ్నలకు నా నుండి సమాధానం రాకపోయేసరికి "చెప్పు డాడీ!" అని ఇద్దరూ నా చేతులు ఊపుతూ పదే పదే అడుగుతున్నారు. వారి ముద్దు ముద్దు మాటలు జోరీగ రొదలా వినిపించి విసుగనిపించాయి. సమాధానం చెప్పే సహనం లేక విసుగెత్తి చెరొకటి చెంపమీద అంటించాను. నా పక్క నుండి లేచి చుర్రుమని తగిలిన దెబ్బకు అరచేత్తో చెంపరాసుకుంటూ ఏడుపు మొహం పెట్టి మౌనంగా నిలబడ్డారు. విసుగ్గా రిమోట్‌తో టీవీ ఆఫ్ చేసి, 'ఎప్పుడూ టీవీ చూడ్డమేనా? వేలు పోసి కాన్వెంటులో చదివిస్తుంటే,. చదవడం మానేసి, టీవీ దగ్గర కూర్చోటమేనా? గంటలకొద్దీ ఆటలాడటం, టీవీ చూడ్డం. వీటి మీదున్న శ్రద్ధ చదువుమీదుందా? బయట నుండి రాగానే "షూ తెచ్చావా డాడీ! సర్కస్‌కు వెళదామన్నావుగా డాడీ" అని అడగటమేనా! రోజురోజుకు మరీ గారాబం ఎక్కువయిపోతోంది. వెళ్ళి చదువుకోండి" అని గద్దించాను. మౌనంగా నిలబడి బిక్క మొహాలతో బేలగా చూస్తున్నారు. ఎన్నడూ కొట్టని, తిట్టని డాడీ, ఈరోజు ఇలా వింతగా ప్రవర్తిస్తున్నాడేమిటి? అనే ప్రశ్న వారిచూపుల్లో ప్రస్ఫుటంగా అగుపడుతోంది. భయంభయంగా మెల్లిగానడుచుకుంటూ వెనుతిరిగి చూస్తూ, బెడ్‌రూంలోకి వెళ్ళారు. కిచెన్‌లో వంటచేస్తున్న అనితకు పెళ్ళయిన ఇన్నాళ్ళలో ఎన్నడూ లేని విధంగా ప్రవర్తించటం కొత్తగా అనిపించింది. నా పక్కన చేరి లంచ్ బాక్స్ బరువుగా ఉండటంతో తెరచి చూసింది "అన్నం తినలేదా?" అంది .

"ఏమి జరిగిందండీ? అలా ఉన్నారు" అంది

కాస్త భయంగా.

"ఏమి జరిగితే నీకెందుకు, ఏది జరిగినా నీకు చెప్పాల్నా?" గయ్‌మన్నాను. మిన్ను విరిగి మీదపడినట్టుగా ఉలిక్కి పడింది. నా కసురుకు అనిత గుడ్ల నీరు కుక్కుకుంది. మా ఇద్దరి మధ్య కొన్ని క్షణాలు మౌనం చోటు చేసుకుంది.

మా మధ్య ఏనాడూ దాపరికాలు లేవు. నిజానికి ఆమెను మించిన ఫ్రెండ్ లేరనే చెప్పాలి. ఇద్దరిదీ ఒకే మాట. వైవాహిక జీవితంలో గొడవ పెట్టుకోలేదు. మాట్లాడుకోకుండా ఉన్నదీ లేదు. నా మాటల్లో మృదుత్వం కరిగిపోయి కరకుతనం కనబడే సరికి అనితకు వింతగా తోచింది. నన్ను నేను శాంత పరచుకునన్నాను. అభంశుభం తెలియని పసిపిల్లల మీద నిర్దాక్షిణ్యంగా చెయ్యి చేసుకున్నందుకు సిగ్గుగా ఉంది. క్లాసులో ఎప్పుడూ ఫస్టు వచ్చే వారిని అనవసరంగా నిందించాను. ఏ విషయం తెలియని అనితను కూడా కసురుకోవడం. ఛీ.. నా మీద నాకే అసహ్యా వేసింది. ఆ పిల్లల మనసులో నన్నెంత ఈసడించుకున్నారో, నేనంటే ఒక రకమైన ఏహ్యాభావం కలగొచ్చు. ఐనా నేను చేసిన పొరబాటుకు వీరు బాధ్యులా? నా అలక్ష్యం వల్ల జరిగిన తప్పిదమిది. ఆ కోసం వీరి మీద చూపించడం ఎంత తెలివి తక్కువ తనం? అనిత తన ఏడుపుని తమాయించుకొని, నీ ఉదాసీన వైఖరి చూసి "ఒంట్లో బాలేదా" అంది తన అరచేతి వేళ్ళను నుదురుపై వేస్తూ. నా కళ్ళ నిండా నీళ్ళు నిండాయి. ఎన్నడూ లేని విధంగా ఉన్న నన్ను చూసి అనిత కంగారు పడి 'ఏం జరిగిందండీ!' అంది తన చేయి నుదురుపై నుంచి తీస్తూ. జరిగినదంతా అనితకు చెప్పాను. నా గుండె బరువు సగం తగ్గింది. నా మానసిక సంఘర్షణ అర్థం చేసుకున్న అనిత, 'ఈ మాత్రానికే డీలా పడి ఎపోవాలా? ఆ రింగ్ దొరక్కపోతే, నా నగలున్నాయి కదా! రేపు ఏదో ఒకటి చేద్దాంలెండి' అంది ధైర్యం చెబుతూ.

'స్నానం చేసి భోంచేద్దురు లెండి!'

'పిల్లలు తిన్నారా?'

'ఉహూఁ'

సోఫాలోంచి లేచి బెడ్‌రూంతోకి తల మాత్రం పెట్టి తొంగి చూశాను. శ్రద్ధగా చదువుకుంటున్నారు పిల్లలు. లోని కెళ్ళిన నన్ను చూసి భయంగా నావైపు చేశారు. "మేము.. మేము.. చదువుకుంటున్నాము డాడీ!" అన్నారు ఇద్దరూ ఒకేసారి భయంగా.

'నాకు కొత్త షూ ఏం వద్దు డాడీ! రేపట్నుంచి టీవీ చూడం డాడీ' అన్నాడు భరత్.

ఇంత మంచి పిల్లల మనసులను గాయపరచి, కొట్టినందుకు నన్ను నేనే లోలోన తిట్టుకున్నాను. ఆప్యాయంగా వారి వైపు చేతులు చాచాను. పరుగున వచ్చి నిల్చున్నారు. ముంగాళ్ళ మీద కూర్చుని వారిని గుండెలకు గట్టిగా హత్తుకున్నాను. నా కళ్ళలో నీళ్ళుబికాయి. ఏమీ అర్థంకాక ఒకరి మొహం ఒకరు చూసుకున్నాను. నా చెంపల మీదికి జారిన కన్నీళ్ళను పిల్లలిద్దరూ తుడిచారు. మరోసారి వారిని హత్తుకొని చెరో ముద్దిచ్చాను. ఇందాకట్నుంచి తలుపు పక్కన నిలబడి మమ్మల్ని గమనించిన అనిత కళ్ళు చెమర్చాయి.

* * *

అనిత నగలు డబ్బుగా మార్చడానికి బయలుదేరి బస్‌స్టాప్‌లో నిల్చున్నాను ఆటో కోసం. ఏ ఆటో చూసినా జనంతో రష్‌గానే ఉంది. నిన్న నిలుచున్న పరిసరాలను గమనించాను. రింగ్ బాక్స్ దొరుకుతుందేమోనని. నా పిచ్చిగానీ, అదెక్కడ దొరుకుతుంది. రోడ్డుపై వాహనాలు తమ యజమానులను గమ్యస్థానాలకు చేర్చే ప్రయత్నంలో స్పీడ్‌గా పరుగెడుతున్నాయి. రోడ్డు అవతలి వైపు యథాలాపంగా చూశాను. రోజూ అక్కడ అడుక్కునే ముసలావిడ రోడ్డు దాటే ప్రయత్నంలో ఉంది. ట్రాఫిక్ రద్దీగా ఉండటంతో తికమకపడుతూ సగం రోడ్డు వరకు వచ్చి, మిగతా సగం దాటే ప్రయత్నం చేస్తుంటే, ఇంతలో ఓ బైక్ రాష్‌గా వచ్చింది. కళ్ళు మూసుకున్నాను. కీచ్ మంటూ ఆ బైక్ చప్పుడు వినబడింది. ఆవిడ్ని గుద్దేసిందని నిర్ధారించుకుని మెల్లిగా కళ్ళు తెరిచాను. అక్కడ బైక్ లేదు కానీ ఆవిడ పడి లేస్తూ కనబడింది. మోచేతికి పెద్ద గాయం అయి రక్తం కారుతోంది. తగిలిన గాయాన్ని పట్టించుకోకుండా ఇటు వైపు రాసాగింది. ఈ ముసలావిడకు ఇంత తొందరెందుకు? మెల్లగా అటూఇటూ చూసి వస్తే గాయం అయ్యేది కాదు కదా? అనుకునన్నాను మనసులో. ఆయాస పడుతూ నా చేరువయ్యింది. కారుతున్న రక్తాన్ని చూసి అయ్యో పాపం అనిపించింది. నా ఎదురుగా వచ్చి నిల్చుంది. "బాబూ" అంది ఆప్యాయంగా. జేబులోకి చెయ్యి పోనిచ్చాను చిల్లర కోసం. ఆమె చేయి చాపలేదు. "బాబూ నిన్న నువ్వు ధర్మంచేసి బస్ ఎక్కే తోపులాటలో నీ జేబులోంచి ఇది పడింది" అంది తన జోలెలోంచి చిన్న బాక్స్ తీసి చూపిస్తూ. ఆ బాక్స్‌ను చూడగానే నా కళ్ళు కాంతివంతమై, మనసు ఆనందార్ణవమైంది. నా సంతోషానికి అవధుల్లేవు. మనసు దూది పింజయింది. మేఘాలలో తేలి పోతున్నట్టుగా తోచింది. కష్టం తీసేసినట్టనిపించింది.

"తీసుకో బాబూ!" అంటూ చేతికందించింది. నా పర్సు తీసి అందులోంచి చేతికందిన నోట్లు ఆనందంగా ఇవ్వబోయాను.

"వద్దు బాబూ! నేనీ డబ్బుకు ఆశపడి నీకిది ఇవ్వలేదు. రోజూ ఇక్కడ ఆడుక్కునే నన్ను చీదరించుకునే వారే ఎక్కువ. కానీ నువ్వు రోజూ ధర్మం చేస్తావు నాయనా.. అది చాలు బాబూ!" అంది.

"నీ చేతికి గాయం తగిలింది కదా! ఈ డబ్బులు తీసుకొని వైద్యం చేసించుకో!"

"ఇలాంటి దెబ్బలు నాకు మామూలే బాబూ. ఇంత సన్న మట్టి, ఉమ్ము కలిపి పెడితే అదే తగ్గిపోతుంది."

"నీకెవరూ లేరా పెద్దమ్మా!" అన్నాను అప్రయత్నంగా వరస కలుపుతూ. ఆ మట నాకు తెలియకుండానే నాలోంచి వచ్చింది. నా వైపు ఆశ్చర్యంగా చూసిన కళ్ళలో నీళ్ళు నిండాయి. కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయింది. భారంగా నిట్టూర్చి, "ఉన్నారు బాబూ! ఒక్కడే కొడుకు. చిన్నప్పుడే తండ్రి పోవడంతో, కష్టపడి పెద్ద చదువులు చదివించాను. ఆ తర్వాత మంచి ఉద్యోగం వచ్చింది. వాడో అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. కొంత కాలం బాగానే చూశారు. నాకీ కుష్ఠురోగం వచ్చాకే నన్ను అంటరానిదానిలా హీనంగా చూసేవారు. కొన్నాళ్ళకు వేరు ఊరికి ట్రాన్స్‌ఫర్ చేయించుకొని, నాకు చెప్పకుండా విడిచి వెళ్ళిపోయారు. ఎక్కడైనా పని చేద్దామని తిరిగాను. నా రోగం చూసి పని ఇచ్చేవాళ్ళే కరువయ్యారు. అలా నా బతుకు రోడ్డు మీది కొచ్చింది బాబూ!" అంది ఆగిఆగి ఏడుస్తూ. నా మనసు చలించిపోయింది. కొంగుతో కళ్ళు తుడుచుకుని పక్క వారిని యాచించడానికి వెళ్ళింది. మెల్లిగా బాక్స్ తెరిచి రింగ్‌ని చూశాను. తళతళ మెరుస్తోంది. ఆమె వైపు చూశాను. ఆమె మంచి తనం ముందు డైమండ్ రింగ్ వెలవెల పోయినట్టుగా అన్పించింది. నేను రోజూ వేసే చిల్లర డబ్బులకు తన ఋణం ఇలా తీర్చుకుంది. ఆమె చేసిన సహాయానికి నేనే ఋణపడిపోయాను. ఆమెను తదేకంగా చూశాను. ఆమె మంచితనం ముందు కుష్ఠురోగం అసలు కన్పించలేదు. "ఎస్! మంచి మనసుగల ఈ స్త్రీమూర్తి నా ఇంటికి పెద్ద దిక్కు అవుతుంది. నాకూ, అనితకూ అమ్మ... పిల్లలకు మామ్మ. అమ్మానాన్నా అంటే తెలియని ఈ అనాథకు ఈ రోజు అమ్మ దొరికింది. ఔను.. అమ్మ దొరికింది. ◆



లేకపోవడంతో అతడిని హెల్పర్ ఉద్యోగంలో నుంచి తొలగించారు. తోటి కార్మికుల సలహాతో అతడు స్థానిక లేబర్ ఆఫీసులో దరఖాస్తు పెట్టుకున్నాడు. తాను యజమాని వద్ద 240 రోజుల కంటే ఎక్కువ రోజులు పని చేసినట్లు లేబర్ ఆఫీసర్‌కు తెలిపాడు. రాజీవ్ కుమార్ లేవనెత్తిన సమస్యను లేబర్ ఆఫీసర్ పారిశ్రామిక వివాదంగా భావించి అతని దరఖాస్తును లేబర్ కోర్టుకు పంపించాడు. లేబర్ కోర్టు నుంచి ఎస్సెన్ డింకి ఆఫీసుకు నోటీసులు వెళ్ళాయి. వారు తమ న్యాయవాది సహాయంతో లేబర్ కోర్టులో జవాబు దాఖలు చేశారు. తమ వద్ద పని చేసిన రాజీవ్ కుమార్ 240 రోజులు పూర్తి చేయకపోవడం వల్ల అతడిని తొలగించామని, అతడు కేవలం తమ కర్మాగారంలో 219 రోజులే ఆ ఏడాదిలో పని చేశాడని, అందువల్ల పారిశ్రామిక వివాదాల చట్టంలోని సెక్షన్ '25 ఎఫ్'లోని నిబంధనలను పాటించకుండానే అతడిని ఉద్యోగంలోంచి తీసివేశామని యాజమాన్యం పేర్కొంది.

రాజీవ్‌కుమార్ ప్రభుత్వాధికారియైన లేబర్ ఆఫీసర్ ద్వారా లేబర్ కోర్టుకు వెళ్ళాడు. అతని కేసును 1995లో లేబర్ కోర్టులో నమోదు చేశారు. లేబర్ కోర్టులో జరిపిన విచారణలో రాజీవ్ కుమార్ సాక్ష్యం ఇచ్చాడు. కంపెనీ న్యాయవాది అడిగిన ప్రశ్నకు జవాబు చెప్తూ తాను కంపెనీలో 240 రోజుల సర్వీసును పూర్తి చేయలేదని చెప్పారు. లేబర్ కోర్టు పారిశ్రామిక వివాదాల చట్టంలోని సెక్షన్ '25 ఎఫ్'ను పరిశీలించింది. ఆ సెక్షన్ ప్రకారం ఒక కార్మికుడు 240 రోజులు పని చేస్తే అతడిని అకారణంగా ఉద్యోగంలో నుంచి తీసివేయకూడదు. కానీ గడిచిన ఏడాదిలో 240 పని దినాలను పూర్తి చేయనట్లయితే అతని యజమాని పై నిబంధనలను అనుసరించకుండానే కార్మికుడిని ఉద్యోగంలో నుంచి తొలగించవచ్చు. లేబర్ కోర్టు కంపెనీ న్యాయవాది వాదనల ప్రకారం రాజీవ్ కుమార్ కేవలం 219 రోజులు మాత్రమే పూర్తి చేశాడని నమ్మింది. 1991 ఫిబ్రవరి 25వ తేదీన రాజీవ్ కుమార్ డ్యూటీ చేయలేదు. ఆ రోజు కర్మాగారంలో సమ్మె జరగడం వల్ల అతడు కూడా సమ్మెలో పాల్గొని విధులకు హాజరు కాలేదు. మరుసటి రోజే అతడిని యాజమాన్యం ఉద్యోగం నుండి తొలగించింది. ఈ విషయాలన్నింటిని పరిశీలించిన లేబర్ కోర్టు న్యాయమూర్తి రాజీవ్ కుమార్ తొలగింపును సమర్థిస్తూ తీర్పు చెప్పారు. రాజీవ్ కుమార్‌కు చట్ట ప్రకారం ఎలాంటి అన్యాయం జరగనందువల్ల అతడి కేసును కొట్టివేశాడు.

రాజీవ్‌కుమార్ లేబర్ కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ 1999లో పంజాబ్ హైకోర్టుకు అప్పీలు చేసుకున్నాడు. రాజ్యాంగంలోని 227 అధికరణం కింద హైకోర్టులో సివిల్ రిట్‌పిటీషన్ దాఖలు చేశాడు. లేబర్ కోర్టు వాస్తవాలకు విరుద్ధంగా ఉందని, తాను పని చేసిన రోజులను లెక్కించటంలో పొరపాటు దొర్లిందని, వీటిని సరి చేసి తనకు న్యాయం చేయాలని హైకోర్టును వేడుకున్నాడు.

పంజాబు హైకోర్టు రాజీవ్ కుమార్ అప్పీలును స్వీకరించి లేబర్ కోర్టు ఫైలును పరిశీలించింది. కార్మికుడు 1990 జులై 1 నుంచి 1991 ఫిబ్రవరి 25 వరకు కర్మాగారంలో పని చేశాడు. ఫిబ్రవరి 25న జరిగిన సమ్మెలో కార్మికుడు పాల్గొన్నాడు. హైకోర్టు ఆదివారాలను, కార్మికుడు జీతం పొందిన సెలవు రోజులను కూడా లెక్కించి అతడు 240 రోజులు పూర్తి చేశాడని భావించింది. కార్మికుని న్యాయవాది, వాది ఇచ్చిన సాక్ష్యం ప్రకారం లెక్కిస్తే 1991 ఫిబ్రవరి 25 నాటికి అతడు 239 రోజులే పూర్తి చేశాడు. ఈ కేసులోని ముఖ్యమైన సమస్య ఏమిటంటే కార్మికుడు 240 రోజులను గత ఏడాదిలో పూర్తి చేశాడా అన్నది.

యాజమాన్యం కార్మికుడిని ఫిబ్రవరి 26న ఉద్యోగంలో నుంచి తొలగించింది. యాజమాన్యం చట్టబద్ధంగానే వ్యవహరించినట్లు లేబర్ కోర్టు తీర్పు చెప్పింది.

పంజాబు హైకోర్టు సుప్రీంకోర్టు పాత తీర్పును ఆధారం చేసుకొని కార్మికుడు పని చేసిన రోజులను లెక్కించింది. ఆ లెక్క ప్రకారం రాజీవ్ కుమార్ 240 రోజులు యజమాని కర్మాగారంలో పని చేసినందువల్ల అతడిని మళ్ళీ సర్వీసులోకి తీసుకోవాలని ఆదేశించింది. అతనికి చెల్లించవలసిన జీతాన్ని 1991 ఫిబ్రవరి 25 నుండి చెల్లించాలని తీర్పు చెప్పింది.

యాజమాన్యం పంజాబు హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ రాజ్యాంగంలోని 136వ అధికరణం కింద సుప్రీంకోర్టుకు వెళ్ళింది. సుప్రీంకోర్టు రాజీవ్‌కుమార్ విషయంలో లేబర్ కోర్టు, హైకోర్టు ఇచ్చిన తీర్పులను పరిశీలించింది. పారిశ్రామిక వివాదాల చట్టం కార్మికుల సమస్యలను తీర్చటానికి పార్లమెంటు రూపొందించిన చట్టం. అది కార్మికుల సంక్షేమం కోసమే తయారు చేసిన చట్టమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అయితే కార్మికులు తమకు జరిగిన అన్యాయాలను కోర్టులో నిరూపించుకుంటే చట్ట ప్రకారం వారికి న్యాయం చేయటానికి వీలుంటుంది. ఎవరైనా కార్మికుడిని సర్వీసులో నుంచి అక్రమంగా తొలగించకుండా ఉండాలంటే అతడు గత 12 నెలల్లో యజమాని వద్ద 240 రోజులు పని చేసినట్లు రుజువు చేసుకోవాలి. ఒకవేళ యజమాని అట్టి విషయాన్ని నిరాకరిస్తే 240 రోజులు పని చేసినట్లు నిరూపించుకోవాల్సిన బాధ్యత కార్మికునిపై ఉంటుంది.

సుప్రీంకోర్టు రాజీవ్ కుమార్ చెప్పిన సాక్ష్యాన్ని పరిశీలించింది. అతడే స్వయంగా తాను 240 రోజులను పూర్తి చేయలేదని కోర్టు ముందు తెలిపాడు. ఇక పంజాబు హైకోర్టు సుప్రీంకోర్టు పాత తీర్పును తప్పుగా అర్థం చేసుకొని తప్పుగా లెక్కించింది. ఆ తీర్పు ప్రకారం ఆదివారాలను, జీతం పొందిన సెలవు రోజులను లెక్కించకూడదు. సుప్రీంకోర్టు తాజాగా 2002 సంవత్సరంలో ఇచ్చిన తీర్పును ఉటంకిస్తూ రాజీవ్ కుమార్ కేసులో తీర్పు చెప్పింది. ఆ తీర్పు ప్రకారం ఎవరైనా కార్మికుడు 240 రోజుల సర్వీసును పూర్తి చేయనట్లయితే కోర్టులు ఏమీ చేయలేవు. కాబట్టి హైకోర్టు తీర్పును కొట్టివేస్తూ లేబర్ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. యాజమాన్యం చట్టబద్ధంగానే వ్యవహరించిందని, రాజీవ్ కుమార్‌ను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోనవసరం లేదని స్పష్టీకరించింది. ◆

కొండబాబు



తటస్థులు..!

"ఇంతకీ మీ వాడేం చదువుతున్నాడు?" చాలాకాలం తర్వాత కలిసిన మిత్రుడినడిగాడు వెంకట్.

"చదవడం గురించి అడక్కు. ఏ కోర్సులో ఉన్నాడని అడుగు. చెప్తా" సుబ్రహ్మణ్యం కాస్త కోపంగా అన్నాడు.

"అదేంటి? చదవకుండా ఏటికేడు పై కోర్సులకు ఎలా వెళ్ళగలడురా!"

"ఏం చదువురా అది. ఎప్పుడూ స్టూడెంట్ సమస్యలు.., యూనియన్లు అంటూ తిరుగుతాడు. మన కెందుకొచ్చిన పాలిటిక్స్‌రా. రాజకీయాలు కూడు పెడతాయా? గుడ్డ ఇస్తాయా? చదువు చెప్తాయా?" గబాగబా అనేశాడు సుబ్రహ్మణ్యం "అదేంట్రా అలాగంటావ్.. సమాజం గురించి పట్టించుకుంటున్నందుకు అభినందించాల్సింది పోయి. ఆ మాటకొస్తే రాజకీయాల గురించి నువ్వు మాత్రం పట్టించుకోవా ఏంటి?"

"నాకా..! నాకు ఏ పార్టీ రాజకీయాలూ లేవు. ఏ పార్టీ రాజకీయాలూ నచ్చవు. ఏదో ఆ రోజు ఓటేస్తానంతే".

* * *

"పార్టీలోకి తటస్థులను కూడా ఆకర్షించాలి.. ఇందుకు మనమేం చేయాలి? ఎవరెవరిని ఆకర్షించాలి? అనేది మనమిప్పుడు చర్చించాలి" పార్టీ అధినేత చెప్పాడు. ఇంకా ఏడాదిన్నర సమయమున్నా ఎన్నికలకు సమాయత్తంగా జరుగుతున్న పార్టీ సమావేశమిది.

"తటస్థులను అసలు ఎలా గుర్తించాలి.." గొణుగుతున్నట్లు మెల్లగా అన్నాడు ఒక నాయకుడు.

అధినేత ఆయనవైపు చురుగ్గా చూశాడు. "ఇది గత ఎన్నికలకు ముందు చేసిందే గదా! ఇంకా కొత్తా?" తీవ్రంగా ప్రశ్నించాడు.

అధినేతతో కాస్త ఎక్కువ చనువున్న నాయకుడు విషయాన్ని తేలిక చేస్తున్నట్లు నవ్వుతూ అన్నాడు "అసలు తటస్థులంటూ ఉంటారా? అర్థం చేసుకోండయ్యా" అన్నాడు. అందరూ నవ్వేశారు.

* * *

– పేర్కొన్న ఈ రెండు సంఘటనల్లోనూ మనం రెండు పదాలను గమనించాలి.

ఒకటోది 'తటస్థులు'. అంటే ఏ పక్షానికీ చెందని వారు. నేటి రాజకీయ పరిభాషలో అర్థం ఏ రాజకీయపార్టీకీ చెందని వారని. రాజకీయ పార్టీ సమావేశంలో జరిగిన చర్చనే చూస్తే.. తటస్థులంటూ ఉంటారా? అనేది ఒక ప్రశ్న.

ఏ పార్టీ రాజకీయాలూ లేని వాళ్లు, లేదా ఏ పార్టీ రాజకీయాలూ నచ్చడమో, నచ్చకపోవడమో ఉండే వాళ్లు ఉంటారా? అంటే.. ఉండరనేదే శాస్త్రీయమైన జవాబు.

వాస్తవంగా ఏ విషయంలోనైనా 'అటో', 'ఇటో' ఉంటుంది తప్ప మధ్యస్థం ఉండదు. మధ్యస్థం, తటస్థం అని ఎవరైనా చెప్పినా దానిని 'నాన్చుడు' అనే అంటాం. కొందరు బాధపడ వచ్చేమో కానీ గోడమీద పిల్లి వాటం, గోపి అనే మాటలను ఇందుకే వాడతారు. ఒక సమస్యపై ఇద్దరు గొడవ పడుతున్నప్పుడు.. తటస్థంగా ఉండటమంటే, అది అన్యాయంగా మాట్లాడే వాడికి మద్దతు ఇవ్వడమే అవుతుంది. ఎంతమాత్రం 'తటస్థం' అవదు. ఎందుకంటే న్యాయం గెలవడానికి మనం తోడ్పడకపోవడమంటే, అన్యాయం గెలవడానికి పరోక్షంగా ఆసరా ఇచ్చినట్లే కాబట్టి.

కాబట్టి తటస్థం అనేది ఉండదు. మరి ఈ మాటను నేడు 'రాజకీయులు' ఎందుకు వాడుతున్నారంటే.. తమ పార్టీ నాయకులపై అవినీతో, అక్రమమో ఏదో మచ్చ ఉండి వారు గెలవక ప్రభుత్వమే ఉండదనుకొన్నప్పుడు ఇలా చేస్తారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను పక్కన బెట్టి, వేరే రంగాల్లో ప్రముఖులైన, బాగా డబ్బు గడించిన వారిని 'తటస్థులు' పేరుతో గెలుపు గుర్రాలుగా దించి ప్రభుత్వాన్ని నిలుపుకోవడం కోసమన్నమాట. దీనివల్ల పార్టీకి డబ్బు ఖర్చు తగ్గుతుంది. ప్రముఖుడైన ఆ 'తటస్థుడే' తన గెలుపుకోసం ఎంతైనా ఖర్చు చేసుకుంటాడు.

ఇంకోమాట.. ఈ పార్టీయే మంచిదని మాట్లాడిన తర్వాత లేదా ఈ పార్టీ తరఫున ఎన్నికల్లో నిలబడిన తర్వాత ఇక ఆయన తటస్థుడెలా అవుతాడు? 'ఈ పార్టీ' వాడు అవుతాడు తప్ప.

ఇక తమకు రాజకీయాలు లేవనటం, రాజకీయాలు కూడూగుడ్డా పెడతాయా? అనటాన్నీ పరిశీలిద్దాం. ఇందాక చెప్పుకున్నట్లు.. ఎన్నికల్లో ఓటేసే వ్యక్తి.. ఏ పార్టీనీ ఇష్టపడని వాడు ఎలా అవుతాడు? తను ఎవరికి ఓటు వేశాడో.. ఆ పార్టీ ప్రభుత్వం రావడం కోసం పని చేసినట్లే కదా! కాబట్టి 'రాజకీయాలు లేవు' అని చెప్పడం అర్థరహితమే అవుతుంది.

అలా అనుకొని ఎవరోకరికి అనే పేరుతో 'ఎవరోకరికి' అవకాశమివ్వడం కంటే ఆలోచించి అన్ని విధాలా ప్రజల తరఫునే పని చేసే పార్టీనే ఎన్నుకోవడం ఉత్తమమార్గమవుతుంది.

'రాజకీయాలు కూడూ, గుడ్డా పెడతామా?' అనే దానినీ చూద్దాం. నేరుగా పెట్టవు కానీ, మనం ఎన్నుకునే ప్రభుత్వాన్ని బట్టే కూడు, గుడ్డా, చదువు అందుబాటులో ఉండటమా? లేకుండా పోవడమా? అనే మౌలికాంశం ఆధారపడి ఉంటుంది. ఇది ప్రజల జీవితాలను, భవితను ప్రభావితం చేసే ముఖ్యమైన అంశం. కావున ఈ పదాల్లోని వాస్తవికతను గుర్తిస్తేనే మెలకువగా వ్యవహరించగలం. ◆

పాఠక స్పందన

రియల్‌స్టోరీ రియల్‌గా ఉంది

16, ఫిబ్రవరి 2003 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన రియల్ స్టోరీ 'అమ్మకానికి అతివలు' చాలా బాగుంది. వారు పడుతున్న వెతలు ఇంకా ఈ కాలంలో కూడా మూఢాచారాలు, దురాచారాల పేరుతో వారిని చిత్రహింసలకు గురి చేస్తూ వారి జీవితాలను సజీవంగా దహనం చేస్తున్న వారిని కఠినంగా శిక్షించి తగిన శిక్ష విధించగలిగినపుడు వారికి నిజమైన విముక్తి కలుగుతుంది.

– మేడూరి సత్యనారాయణ, తిరుపూరు

కనువిప్పు కలిగించిన 'తెరచిన డైరీ'

"మానవీయ విలువలు నేర్పని చదువులు, మనిషిని మనిషిగా నిలబెట్టలేని చదువులు మనకొద్దు" అంటూ నేటి మానవత మరచిన, నాగరికత కోరల్లో చిక్కి విలవిలలాడుతున్న మనుషులకు కనువిప్పు కలిగేలా 'తెరచిన డైరీ' కథ ద్వారా ఎ.రవీంద్ర బాబు చక్కగా ఉద్బోధ చేశారు. ఇతర దేశాల మీద మోజుతో ఎగబడుతున్న యువతకు అక్కడి వాస్తవాలు తెలుసుకోవడం అవసరం. డబ్బు కోసం ఆత్మాభిమానాన్ని, మానసిక ప్రశాంతతను బలి పెట్టడం నేటి యువత మానుకోవాలి. రచయితకు అభినందనలు. అలాగే బాలవికాసం శీర్షికలో వి.ఆర్.వాగోలు వ్యాసం బాగుంది. పిల్లలున్న పెద్దలు, ఉపాధ్యాయులు తప్పక చదవాల్సిన, ఆచరించాల్సిన వ్యాసం. ఈ రోజు పాఠశాలల్లో పిల్లలు పాఠ్యాంశాలు బట్టీ వేయడం, ఎంట్రెన్స్‌లకు కుస్తీలు పట్టడం తప్ప దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం వెతకలేక 'ఆత్మహత్యలకు' పాల్పడుతున్నారు. వాళ్ళలో ఆ పరిష్కార శక్తి పెంపొందింప జేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే. వ్యాసరచయితకు, సంపాదక వర్గానికి కృతజ్ఞతలు, అభినందనలు.

– కొమ్మారెడ్డి లలిత, పెదవడ్లపూడి, గుంటూరు జిల్లా